RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

NETIMANADESAM TELUGU DAILY


Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 172 విశాఖపట్నం సంపాదకులు: కె.ఎస్.రంగశాయి గురువారం 20-08-2026 పేజీలు :8 వెల: రూ.1-00

## త్యాగం మీది? అండ మాది

- వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం
- నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు



**అమరావతి, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.రూ.518 కోట్ల మేర పరిహారం అందజేతవెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

## ప్రొఫెసర్లు చేయాల్సిన పని కార్మికులతో..
## గ్రూప్-1లో భయంకరమైన అక్రమాలు
## చంద్రబాబునాయుడు



**అమరావతి, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆట లాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమా లపై శాసన సభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు.

**ఇష్టానుసారం వ్యవహరించారు..**

"గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు? మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు.

**పరీక్ష రాసిన వ్యక్తిని పేపర్లు దిద్దేందుకు..**

తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను [తరువాయి 2లో..

## ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టాం
- రెండేళ్ళలో 1800కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి
- చంద్రబాబు ముందుచూపు వల్లే ఏలేరు ఆయకట్టుకు నీరిస్తున్నాం
- అసెంబ్లీలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ఇటీవలే పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే [తరువాయి 2లో..

## కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..
## ఆత్మకథపై సోనియా గాంధీ




**ఢిల్లీ, ఆగస్టు 19 :** దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు. సోనియా అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు రాజకీయాలవైపు లాగా యని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం, తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను రాబట్టడం అంత సులువుగా జరగలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

## విశాఖ వేదికగా
## బ్రిక్స్ దేశాల కీలక సమావేశాలు

- 22, 23 తేదీల్లో యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు
- 11 బ్రిక్స్ దేశాల నుంచి మంత్రులు, ఉన్నతాధికారుల రాక
- భాగస్వామ్యం కానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.!






**విశాఖపట్నం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి విశాఖపట్నం వేదిక కానుంది. భారతదేశం 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో 2వ బ్రిక్స్ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రుల సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన బ్రిక్స్‌కు చెందిన 11 దేశాల నుంచి మంత్రులు, ఉన్నతస్థాయి ప్రతినిధులు విశాఖకు రానుండటంతో నగరం అంతర్జాతీయ అతిథ్యానికి సిద్ధమవుతోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యంతో జరిగే ఈ సమావేశాలు యువత, క్రీడలు, ఆవిష్కరణలు, [తరువాయి 2లో..

## ఏపీలో 100 మున్సిపాలిటీల్లో త్వరలో ఎన్నికలు




**అమరావతి, , ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేస్తూ ముందుకెళ్లనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్, సంచాలకులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి.

ఇప్పటికే పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీ కాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల కూడా ఇప్పుడే ఎన్నికలు జరపనున్నారు. న్యాయపరమైన వివాదాలు, ఇతర సమస్యల కారణంగా మిగిలిన 23 పురపాలక సంఘాల్లో ప్రస్తుతానికి ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం తెలిపింది.

16వ ఆర్థిక సంఘం తాజా మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు కావాలంటే ప్రజలతో ఎన్నికైన పాలకవర్గం తప్పనిసరి. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే పట్టణ స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదముంది. రాజ్యాంగబద్ధమైన పాల [తరువాయి 2లో..

మొదటిపేజీ తరువాయి...

## ప్రొఫెసర్లు చేయాల్సిన పని కార్మికులతో..

# గ్రూప్-1లో భయంకరమైన అక్రమాలు

కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది.

**వైకాపా హయాంలో అతిపెద్ద స్కామ్ :** వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ముందుచూపుతో నాడు చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు ఖర్చు చేసి, అత్యంత క్లిష్టమైన పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులను పూర్తి చేశామని తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి అవసరాల కోసం 950 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏలేరు ఆయకట్టుకు ఇప్పటివరకు 2.6 టీఎంసీల నీటిని పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనలో ఏలేరు నదీగర్భంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా బెడ్ లెవల్ పడిపోయిందని, దీంతో గ్రావిటీ ద్వారా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 548 రాడఓ పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ఆయకట్టుకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరో రూ.15.84 కోట్లతో ఓ అండ్ ఎం పనులకు ప్రతిపాదనలు పంపామని మంత్రి వెల్లడించారు.


# ఏపీలో 100 మున్సిపాలిటీల్లో త్వరలో ఎన్నికలు

నతో పాటు, ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘంతో పూర్తిస్థాయిలో సమన్వయం చేసుకోవాలని పురపాలక శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# విశాఖ వేదికగా బ్రిక్స్ దేశాల కీలక సమావేశాలు



స్థాయి ఆతిథ్యం అందించేలా జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. రాడిసన్ బ్లూ రిసార్ట్స్, నోవాటెల్ హోటళ్లలో ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికల వరకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, రవాణా, ప్రోటోకాల్ ఏర్పాట్లను



నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై కీలక చర్చలకు వేదిక కానున్నాయి. »Building for Resilie nce, Innovation, Cooperation and Sustaina bili-tyµ అనే విస్తృత అంశంతో జరిగే సమావేశాల్లో యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత, ఆవిష్కరణలు, సాధికారతతో పాటు క్రీడా అభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, సంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ తదితర అంశాలపై సభ్య దేశాలు చర్చించనున్నాయి.

**విశాఖ ప్రత్యేకతను చాటే కార్యక్రమాలు**

22న తోట్లకొండలో మొక్కల నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన, ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం హోటల్ రాడిసన్ బ్లూలో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి హోటల్ నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో గాలా డిన్నర్ నిర్వహించనున్నారు. దీనిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి భాగస్వామ్యంకానున్నారు. 23వ తేదీ ఉదయం నిర్వహించనున్న బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నోవాటెల్ నుంచి రామకృష్ణ బీచ్ రోడ్, సబ్‌మెరైన్ మ్యూజియం, సీ హారియర్ ప్రాంతం మీదుగా సుమారు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగనుంది. అనంతరం క్రీడా మంత్రుల సమావేశం, విశాఖలోని క్రీడా ప్రదేశాల సందర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

**ప్రతినిధుల కోసం అత్యున్నత స్థాయి ఏర్పాట్లు**

అంతర్జాతీయ ప్రతినిధు లకు అత్యున్నత

సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వైద్య బృందాలు, అంబులెన్సులు, అగ్నిమాపక సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆహార భద్రత తదితర అంశాలపై సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేదిక, ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆడియో-విజువల్, లైటింగ్ తదితర సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాల సమన్వయకర్తగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడును నియమించారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, ప్రతినిధుల రాక నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశాన్ని పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం నగరానికి లభించిన అరుదైన గౌరవంగా నిలవనుంది. యువత, క్రీడలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారంపై ప్రపంచ దేశాల ప్రతినిధులు చర్చించే ఈ సమావేశాల ద్వారా విశాఖపట్నం తన అంతర్జాతీయ ప్రతిష్టను మరోసారి చాటుకోనుంది. అంతర్జాతీయ ప్రతినిధుల పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఇప్పటికే అధికారులతో సమీక్షించి, విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికలు ఏర్పాటు చేయాలన్నారు

# కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

**అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత**
**మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు**



కోల్‌కతా, ఆగస్ట్19 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మీర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# పేపర్ లీక్ పిటిషన్‌పై కేంద్రప్రభుత్వ స్పందన కోరిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 19 :** ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుల్లో ప్రత్యేక, కాలవ్యవధితో కూడిన దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్.నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. పేపర్ లీకేజీలకు పాల్పడిన నిందితులు, వారి కుటుంబసభ్యుల ఆస్తిని స్వాధీనం చేసుకునే విధంగా ఆదేశాలివ్వాలని పిటిషన్ కోరింది. అవినీతి నిరోధక చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం, బినామీ, బ్లాక్ మనీ చట్టాలతో పాటు సంబంధిత చట్టాల కింద దర్యాప్తు చేపట్టాలని కోరారు.

# టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బిఆర్ఎస్ పిలుపు

## హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్19 :** మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.

అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు.

వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

## మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

**అమరావతి, ఆగస్ట్19 :** ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని చైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవిం చటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు.


**Arcil**

**అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్ (ఆర్సిల్)**
**వివిధ ఆర్సిల్ ట్రస్టులకు ట్రస్టీగా వ్యవహరిస్తున్న హోదాలో**
ఆర్సిల్ కార్యాలయం: ది రూబీ, 10వ అంతస్తు, 29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (పశ్చిమ), ముంబై-400 028
వెబ్‌సైట్: HTTPS://AUCTION.ARCIL.CO.IN; CIN-U65999MH2002PLC134884

**ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణ మరియు సెక్యూరిటీ ఆసక్తుల అమలు చట్టం, 2002 (SARFAESI చట్టం) మరియు సెక్యూరిటీ ఆసక్తుల (అమలు) నియమాలు, 2002లోని నియమాలు 6, 8 & 9ల క్రింద అధికారాలను ఉపయోగించి ఆన్‌లైన్ ఇ-వేలం ద్వారా అమ్మకం కోసం ప్రజా ప్రకటన. సెక్యూరిటీ ఆసక్తుల (అమలు) నియమాలు, 2002లోని నియమాలు 6, 8 & 9లతో కలిపి చదవాలి.**

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) / హామీదారు(లు) / తనఖాదారు(లు)కు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, వివిధ ఆర్సిల్ ట్రస్టులకు ("ARCIL") ట్రస్టీ హోదాలో వ్యవహరిస్తున్న అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్‌కు (రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ల ద్వారా ఆర్థిక ఆస్తి అప్పగింతకు అనుగుణంగా) తనఖా/చార్జ్ చేయబడిన, క్రింద వివరించబడిన స్థిరాస్తి(లు)ను, బకాయి ఉన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు మొదలైనవాటితో పాటుగా వసూలు చేయడం కోసం, క్రింద వివరించిన విధంగా, ఆన్‌లైన్ ఇ-వేలం పద్ధతిలో "యథాతథంగా", "ఉన్నది ఉన్నట్లుగా", "ఏది ఉంటే అది" మరియు "ఎటువంటి ఆధారం లేకుండా" అనే ప్రాతిపదికన అమ్మడం జరుగుతుంది. ఈ అమ్మకం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు) నియమాలు, 2002లోని నియమాలు 6, 8 మరియు 9లతో కలిపి చదవబడిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") యొక్క నిబంధనల ప్రకారం జరుగుతుంది. ("నియమాలు").

| రుణగ్రహీత పేరు / సహ-రుణగ్రహీత/లు / హామీదారు/లు / తాకట్టుదారు/లు | రుణ ఖాతా సంఖ్య & విక్రయిస్తున్న బ్యాంకు | ట్రస్ట్ పేరు | SARFAESI నోటీసు (తేదీ 15/డిసెంబర్/2022) ప్రకారం చెల్లించవలసిన మొత్తం | స్వాధీన రకం మరియు తేదీ / తనిఖీ తేదీ / ఆస్తి రకం మరియు ప్రాంతం | ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) / రిజర్వ్ ధర / ఇ-వేలం తేదీ మరియు సమయం |
|---|---|---|---|---|---|
| రుణగ్రహీత: కిరణ్ కుమార్ శృంగారపు సహ-రుణగ్రహీత: వేంకటసంతామణి లక్కోజి | LP0000000094142 వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (VHFC) | ఆర్సిల్-ట్రస్ట్-2025-018 | రూ. 2494618/- 10/డిసెంబర్/2022 నాటికి + దానిపై అదనపు వడ్డీ + న్యాయపరమైన ఖర్చులు. | భౌతిక తేదీ: 30/అక్టోబర్/2025<br>అభ్యర్థన మేరకు ఏర్పాటు చేయబడుతుంది<br>134 1/2 % లో 67 1/4 చదరపు గజాల భూమి | రూ.225000/- (రెండు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)<br>రూ.22,50,000/- (ఇరవై రెండు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)<br>21-09-2026 ఉదయం 11:00 గంటలకు |

వేలం వేయబడుతున్న భద్రపరచబడిన ఆస్తి యొక్క వివరణ: డి.నెం.5-4-46 గల ఇంటి యొక్క మొత్తం గ్రౌండ్ ఫ్లోర్, 1210 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో, మరియు సర్వే నెం.62/3,4 పరిధిలోని 134 1/2 % భూమిలో నుండి 67 1/4 చదరపు గజాల అవిభక్త వాటా, ఇది సారధి గ్రామం, రాజాం నగర్ పంచాయతీ, మండలం మరియు ఎస్.ఆర్.ఓ, శ్రీకాకుళం జిల్లా, డోర్ నెం. 5-4-46, అసెట్ నెం. 1133007506, ఆంధ్రప్రదేశ్, 532127 వద్ద ఉంది. తూర్పు వైపున: * ఈ ఇంటికి మరియు శృంగరాపు మురళీధర్ రావు గారి డబ్బా ఇంటికి మధ్య ఉన్న ఉమ్మడి గోడ పడమర వైపున: * అల్లా బోయిన రామయ్య స్థలంలో షీట్స్ షెడ్ , ఉత్తర వైపున:* 1 1/2 అడుగుల కల్వా , దక్షిణ వైపున:* రోడ్డు

| | | | |
|---|---|---|---|
| ARCIL కు తెలిసిన పెండింగ్ వ్యాజ్యాలు | లేదు | ARCILకు తెలిసిన భారాలు/బకాయిలు | లేదు |
| బిడ్ సమర్పించడానికి చివరి తేదీ | అదే రోజు వేలానికి 2 గంటల ముందు | బిడ్ పెంపు మొత్తం: | బిడ్ పత్రంలో పేర్కొన్న విధంగా |
| డిమాండ్ డ్రాఫ్ట్ ఈ పేరు మీద తయారు చేయాలి పేరు మీద: | ఆర్సిల్-ట్రస్ట్-2025-018 | సమాన విలువకు చెల్లించబడుతుంది | |
| RTGS వివరాలు | ఆర్సిల్-ట్రస్ట్-2025-018, ట్రస్ట్ ఖాతా నెం: 57500001745590, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్: కమలా మిల్ ఎక్స్‌టెన్షన్ సెంటర్, ముంబై, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: HDFC0000542 | | |
| సంప్రదించవలసిన వ్యక్తి పేరు మరియు నంబర్ | అర్పిత్ చౌదరి ARPIT.CHOUDHARY@VASTUHFC.COM; 73573 75589, సంతోష్ తివారీ - 99204 90126, శేఖర్ శర్మ - 86557 96116, నవనీత్ సింగ్ - 99991 05933 | | |

నిబంధనలు మరియు షరతులు:
1. ఈ వేలం అమ్మకం HTTPS://XPERTAUCTION.COM వెబ్‌సైట్ ద్వారా ఇ-వేలం పద్ధతిలో, బిడ్ పత్రంలోని నిబంధనలు మరియు షరతులకు అనుగుణంగా, మరియు అందులో పేర్కొన్న విధానం ప్రకారం నిర్వహించబడుతోంది.
2. ఇంటర్నెట్ కనెక్టివిటీ, నెట్‌వర్క్ సమస్యలు, సిస్టమ్ క్రాష్ అవ్వడం, విద్యుత్ వైఫల్యం మొదలైన వాటికి అధీకృత అధికారి ("AO")/ ARCIL బాధ్యత వహించరు.
3. వేలం యొక్క ఏ దశలోనైనా, AO ఎటువంటి కారణం చెప్పకుండా మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా బిడ్/ఆఫర్‌ను ఆమోదించవచ్చు/ తిరస్కరించవచ్చు/సవరించవచ్చు/రద్దు చేయవచ్చు లేదా వేలాన్ని వాయిదా వేయవచ్చు.
4. విజయవంతమైన కొనుగోలుదారు/బిడ్డర్, వర్తించే చట్టం ప్రకారం, తనకు/ఆమెకు/దానికి అనుకూలంగా భద్రపరచబడిన ఆస్తిని బదిలీ చేయడానికి/అప్పగించడాని చెల్లించాల్సిన ఏవైనా చట్టబద్ధమైన బకాయిలు, పన్నులు, రుసుములు, కొనుగోలు ప్రతిఫలంపై వర్తించే GST, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు మొదలైనవాటిని భరించాలి.
5. వేలం వేయాలనుకునే బిడ్డర్లు, తమ బిడ్‌ను సమర్పించే ముందు, హామీగా ఉంచిన ఆస్తిపై ఉన్న భారాలు, దాని యాజమాన్య హక్కు మరియు చట్టబద్ధమైన బకాయిలతో సహా, ఆ హామీ ఆస్తులను ప్రభావితం చేసే క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలు మొదలైన వాటికి సంబంధించి తమ సొంత స్వతంత్ర విచారణలు/సముచిత పరిశీలన చేసుకోవాలి. ఈ వేలం ప్రకటన ARCIL యొక్క ఎలాంటి నిబద్ధతను లేదా ప్రాతినిధ్యాన్ని ఏర్పరచదు మరియు ఏర్పరచబోదు. ARCIL యొక్క అధీకృత అధికారి ఏవైనా మూడవ పక్షం క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు.
6. వార్తాపత్రికలో ప్రచురించబడిన వేలం ప్రకటనలో పేర్కొన్న వివరాలు, దిగువ సంతకం చేసిన వారి సమాచారం మేరకు ఉత్తమంగా తెలియజేయబడ్డాయి; అయినప్పటికీ, ఏవైనా పొరపాట్లు, తప్పుడు ప్రకటనలు లేదా లోపాలకు దిగువ సంతకం చేసిన వారు బాధ్యత వహించరు.
7. సదరు బకాయిలకు బాధ్యత వహించే రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు, పైన పేర్కొన్న వేలం అమ్మకం నిర్వహణ గురించి, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు) నియమాలలోని 8 మరియు 9 నిబంధనల ప్రకారం ఈ అమ్మకం ప్రకటనను ఒక నోటీసుగా పరిగణించాలి.
8. పైన షెడ్యూల్ చేయబడిన వేలం ఏ కారణం చేతనైనా విఫలమైన పక్షంలో, నియమాలు మరియు చట్టంలోని నియమం 8(5) నిబంధనల ప్రకారం ఏదైనా ఇతర పద్ధతుల ద్వారా భద్రపరచబడిన ఆస్తిని విక్రయించే హక్కు ARCILకి ఉంటుంది.

స్థలం: శ్రీకాకుళం
తేదీ : :20.08.2026

సంతకం/- అధీకృత అధికారి
అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్



**దక్షిణ తీర రైల్వే**
**విశాఖపట్నం**
@SCoRailwayలో మమ్మల్ని అనుసరించండి
వెబ్‌సైట్: www.scor.indianrailways.gov.in

PUB/SCoR-192

**టెండర్ నెం. : వి.ఎస్.కె.పి- ఎలెక్ట్‌జి-26-27-డబ్ల్యు.సి-12, తేదీ : 14-08-2026**

భారత రాష్ట్రపతి తరపున, దిగువ సంతకం చేసిన నేను ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నాను.

టెండర్ నోటీసు నెం. VSKP- ELECTG-26-27-WC-12 యొక్క వివరాలు. టెండర్ నెం.: VSKP-ELECTG-26-27-WC-12.
పని పేరు : సాంప్రదాయ సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో శక్తి సమర్థవంతమైన BLDC సీలింగ్ ఫ్యాన్లను అమర్చడం. వాల్తేర్ డివిజన్‌లోని PSA-DVD సెక్షన్ పరిధిలో ఉన్న SEE/ELG యూనిట్ల అధికార పరిధిలోని సర్వీస్ భవనాలు, స్టేషన్లు, ఛాంబర్లు మొదలైన వాటిలో సెన్సార్లు, LED ఇన్వర్టర్ బ్యాటన్ లైట్ & వీధి దీపాలను ఏర్పాటు చేయడం.
నాణ్యత : టెండర్ పత్రంలో పేర్కొన్న విధంగా. పూర్తిచేయవలసిన కాలపరిమితి : 180 రోజులు. టెండర్ విలువ : రూ. 1,44,83,144.82/- (ఒక కోటి నలభై నాలుగు లక్షల ఎనభై మూడు వేల నూట నలభై నాలుగు మరియు ఎనభై రెండు పైసలు మాత్రమే). బిడ్ సెక్యూరిటీ / ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చేయవలసింది : రూ.2,89,700/- (రూపాయిలు రెండు లక్షల ఎనభై తొమ్మిది వేల ఏడు వందలు మాత్రమే). టెండర్ పత్రం ఖర్చు : రూ. 0/- (ఏమీ లేదు). ఆఫర్ చెల్లుబాటు : టెండర్ తెరిచిన తేదీ నుండి 60 రోజులు. టెండర్ రకం : పనులు పనుల కొరకు GCC-2022 ద్వారా నియంత్రించబడే టెండర్. టెండరింగ్ విధానం : ఓపెన్ టెండర్ - సింగిల్ ప్యాకెట్. టెండర్ ముగింపు సమయం & తేదీ : 14-09-2026, మధ్యాహ్నం 13:30 గంటలకు. టెండర్ పత్రం మరియు సవరణల కోసం : వెబ్‌సైట్‌ను సందర్శించండి
http://www.ireps.gov.in
సంప్రదింపుల కొరకు పోస్టల్ చిరునామా : సీనియర్ డీఈఈ/జీ/వీఎస్‌కేపీ, డీఆర్ఎం కార్యాలయం, ఆఫీస్ బిల్డింగ్, డొండపర్తి, విశాఖపట్నం - 530004, ఆంధ్రప్రదేశ్.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (జి), విశాఖపట్నం.

PUB/SCoR-193

**బహిరంగ ఇ-టెండర్ నోటీసు నెం. : బి/ఇ.ఇజిఎస్/09/2026-27, తేదీ : 12-08-2026.**

భారత రాష్ట్రపతి తరపున, దిగువ సంతకం చేసిన నేను, దిగువ పేర్కొన్న తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు కింది పనుల కోసం ఇ- టెండర్‌ను ఆహ్వానిస్తున్నాను.

1. బి/ఇ.29/ఐ/ఇజిఎస్/22/26-27 తేదీ : 07-08-2026. పని పేరు : (i)విజయవాడ డివిజన్ - ఏబిఎస్ఎస్ పరిధిలో, టియుఎన్ఐ, వైవిఎం, ఏపిటి, ఎన్డిడి, ఎస్ఎల్ఓ, సిసిటి, ఏకెపి, బివిఆర్టి, ఆర్వైపి, ఎస్కెఎం, ఓజిఎల్, ఈఇ, సిఎల్ఎక్స్ & బిపిపి అనే 14 స్టేషన్లలో సాఫ్ట్ అప్‌గ్రేడేషన్ & సిఓపి షెల్టర్లకు అదనపు పరిమాణంలో / వస్తువుల విద్యుత్ ఏర్పాట్లను అందించడం.
ii) విజయవాడ డివిజన్ : రైల్వే స్టేషన్లలో వెలుగు స్థాయిలను మెరుగుపరచడం & కావలి & బివిఆర్టి స్టేషన్లలో విమానాశ్రయ లైటింగ్ ఏర్పాటు. పూర్తి చేయవలసిన కాలం : 6 నెలలు. టెండర్ విలువ (రూ.) : 7,64,66,152.55. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ / బిడ్ సెక్యూరిటీ (రూ.) : 15,29,300/-. టెండర్ పత్రం ఖర్చు రూ. : ఏమీ లేదు. ముగింపు తేదీ : 31-08-2026.

1) టెండర్లలో పాల్గొనబోయే వారు, టెండర్ల గడువు ముగిసే తేదీకి ముందే, ఏవైనా టెండర్లకు సంబంధించిన మార్పులు / సవరణలను గమనించడానికి "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (విద్యుత్), విజయవాడ.

PUB/SCoR-194

**ఇ-టెండర్ నోటీసు నెం. : ETCECIIVSKP2026005, తేదీ : 11-08-2026**

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న CAO/Con/SCoR/VSKP, టెండర్ నెం. ETCECIIVSKP2026005కు గాను ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేదీ/సమయం 03-09-2026 ఉదయం 11:00 గంటలు. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్‌లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు, మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్ ఏదైనా స్వీకరించబడితే, అది విస్మరించబడుతుంది.

పని పేరు : విజయవాడ జంక్షన్ మరియు నిడదవోలు జంక్షన్ స్టేషన్ల మధ్య (127.05 కి.మీ.) 3వ మరియు 4వ లైన్ కోసం తుది స్థాన సర్వే నిర్వహించడం. ప్రకటించిన విలువ : రూ. 3,81,15,000/-. టెండర్ పత్రం ఖర్చు : రూ. 0.00. డిపాజిట్ చేయవలసిన ఎర్నెస్ట్ మనీ :రూ. 7,62,300/-. పని పూర్తి చేసే కాలం : 6 నెలలు. టెండర్ చివరి తేదీ & సమయం : 03-09-2026 ఉదయం 11:00 గంటలు.

పై ఈ-టెండర్‌కు సంబంధించిన ఈ-టెండర్ పత్రాలతో సహా పూర్తి సమాచారం http://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. ఏవైనా సవరణలు ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

టెండర్దారులు అన్ని సూచనలను జాగ్రత్తగా చదివి, అన్ని సూచనలను పాటిస్తున్నారని నిర్ధారించుకోవాలి.

ప్రధాన పరిపాలనా అధికారి, (కాన్), విశాఖపట్నం.

PUB/SCoR-195

**బహిరంగ టెండర్ ప్రకటన సంఖ్య: బి-ఇ29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-16-2026-27, తేదీ : 17-08-2026.**

భారత రాష్ట్రపతి తరపున, దిగువ సంతకం చేసిన నేను ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నాను.

టెండర్ నెం. : బి-ఇ29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-16- 2026-27. పని పేరు : విజయవాడ డివిజన్‌లో తుప్పుపట్టిన కాంటిలివర్లు, యాంటీ క్రీప్, ఓవరేజ్డ్ ఇన్సులేటర్లు మరియు కాంపోజిట్ ఇన్సులేటర్ల మార్పిడి. సుమారు విలువ (రూ.) : రూ.3,23,13,241.00. పూర్తిచేయు కాలం : 12 నెలలు. బిడ్ సెక్యూరిటీ (ఇఎండి) (రూ.) : రూ.6,46,300/-. చివరి తేదీ : 10-09-2026. టెండర్ ఫారం ఖర్చు : ఏమీ లేదు.

పూర్తి వివరాలు మరియు షరతుల కోసం మా సైట్ "www.ireps.gov.in"ను సందర్శించండి. గమనిక; టెండర్ తెరిచే తేదీ సెలవుదినం అయితే, టెండర్ తదుపరి పనిదినం నాడు తెరవబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టిఆర్‌డి, విజయవాడ.

SCoR-A226

మరిన్ని టెండర్ షరతులు/వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

### సవాళ్లను స్వీకరిస్తేనే ప్రజలు ఆదరిస్తారు !

సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది. ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్దికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి. ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌలికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ధి కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసు కుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్‌డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచి పనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.


## ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులకు అసెంబ్లీ సందర్శనకు అవకాశం

**– ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవడానికి అసెంబ్లీ సందర్శన ఎంతో ఉపయోగకరం– ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**



**విశాఖపట్నం ఆగస్టు 19 (నేటి మనదేశమ్)** :ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ విద్యార్థినీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరావతికి వెళ్లి ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గౌరవ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం శాసనసభలో జరుగుతున్న సమావేశాల తీరును ప్రత్యక్షంగా వీక్షించి, చట్టసభ కార్యకలాపాలు, ప్రజా సమస్యలపై చర్చలు, ప్రజాస్వామ్య పాలనా విధానం తదితర అంశాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం స్పీకర్ గారితో కలిసి విద్యార్థులు ఫొటోలు దిగుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు మాట్లాడుతూ.. పుస్తకాల ద్వారా తెలుసుకునే శాసనసభ వ్యవస్థను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అనుభవం తమ విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థపై యువతకు అవగాహన పెంపొందించడం, రాజకీయ మరియు శాసన ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిచయం చేయడం ద్వారా బాధ్యతా యుతమైన పౌరులను తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం విద్యా సంస్థలకే పరిమితం కాకుండా ప్రజాస్వామ్య సంస్థల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో...

ప్రొఫెసర్ ప్రేమా నందం, అధ్యాపకులు నాగరాజు, సత్య నారాయణ ఇతర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా రేషన్ షాపులో జేసీ తనిఖీ

### నాణ్యత, నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం



**విజయనగరం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్)** : ఐవీఆర్ఎస్ ద్వారా అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ నెల్లిమర్ల మండలంలోని ఎఫ్‌పీ షాప్ నంబర్ 22403ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులో అందుబాటులో ఉన్న నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి, వాటి నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ ప్రక్రియ, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన జేసీ, ప్రజలకు నాణ్యమైన సరుకులను సక్రమంగా అందించడంతో పాటు స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సరిగ్గా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచిం చారు. ప్రజలకు అవసరమైన సమయంలో రేషన్ సరుకులు అందుబాటులో ఉండేలా తగినంత నిల్వలు నిర్వహించాలని, సరుకుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని ఆదేశించారు.

ఐవీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సేవలను మరింత మెరుగుపరచాలని సూచిం చారు. ఈ తనిఖీలో నెల్లిమర్ల తహసీల్దార్ డి. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సచివాలయంలో జేసీ ఆకస్మిక తనిఖీ



**విజయనగరం, ఆగస్టు 19 (నేటి మన దేశమ్)** : విజయనగరం, ఆగస్టు 19: ఐవీఆర్ఎస్ ద్వారా అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ బుధవారం నెల్లిమర్ల మండలం కొండవెలగాడ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలపై క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకునేందుకు పలువురు రైతులకు ఫోన్ చేసి, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో నేరుగా మాట్లాడిన జేసీ, సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలు, ఫిర్యాదులు, సేవలు పొందడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై వివరాలు సేకరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో, పారదర్శకంగా, సంతృప్తికరంగా అందేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందిని జేసీ ఆదేశించారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ద్వారా గుర్తించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో నెల్లిమర్ల తహసీల్దార్ డి.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ లో శిక్షణ

ఎస్విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ లో శిక్షణ



**భీమునిపట్నం : ఆగస్టు 19 నేటి మనదేశమ్** : పి ఎం ఉష పథకం లోభాగంగా స్థానిక ఎస్ వి ఎల్ ఎన్ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు టైలరింగ్ , ఎంబ్రాయిడరింగ్ లో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేఖ మాట్లాడుతూ విద్యార్థినిలు సర్వతోముఖ అభివృద్ధి చెందాలని, స్కిల్స్ పెంచుకోవాలని, స్కిల్ ఉంటే జీవితంలో స్వయం ఉపాధికతను సాధిస్తూ నిలబడగలరని తెలిపారు. ఈ కార్యక్రమానికి పీఎం ఉషా కోఆర్డినేటర్ గా జయశ్రీ, ట్రైనర్ గా సూర్య కుమారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.వి. విద్యాసాగర్, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ వై. వెంకట్రావు , విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. డి. ప్రవీణ, ప్రసాద్ , ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కఠిన చర్యలు

### రెండు కేసుల్లో ఇద్దరికి రూ.10,000 చొప్పున జరిమానా




**శ్రీకాకుళం, ఆగస్టు 19 నేటి మనదేశమ్** : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై జిల్లా పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానాలు నిందితులకు బుధవారం జరిమానా విధించాయి.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కేసులో.తేదీ 14-08-2026న శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్‌లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో విశాఖపట్నానికి చెందిన కారు డ్రైవర్ వల్ల కిరణ్ వర్మ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఈ కేసును గౌరవ 2వ తరగతి మేజిస్ట్రేట్ పుట్ట రాజకుమారి ఎదుట హాజరుపరచగా, నిందితుడికి రూ.10,000/-జరిమానా విధించారు. నరసన్నపేట పోలీస్ స్టేషన్లలో బోయి నవీన్, తండ్రి పకీర్ అనే వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నరసన్నపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, గౌరవ మేజిస్ట్రేట్‌వాణి రూ.10,000/- జరిమానా విధించారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉన్నందున, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు.

## జివిఎంసి ఒకటవ వార్డులో పర్యటించిన

### కెవిపిఎస్,సిఐటియు భీమిలి జోన్ కమిటీ నాయకులు పర్యటన



**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్** : సామాజిక శంఖారావం లో భాగంగా జి వి ఎం సి ఒకటవ వార్డు విల్సన్ పేట దళిత కాలనీ లో బుధ వారం కె వి పి ఎస్ నాయకులు జలమడుగుల సురేష్, సి ఐ టి యు భీమిలి జోన్ కమిటీ అధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి, కార్యదర్శి ఎస్ అప్పల నాయుడు పర్యటించారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన చిట్టి వలస జ్యూట్ క్వార్టర్ లో ఉంటున్నామని, వర్షం కురిస్తే ఇంట్లోకి వర్షపు నీరు వస్తుందని, పిల్లా పాపలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ,నిమ్మకాయల శ్యామల, వెంకట లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

ఏ ప్రభుత్వంలో కూడా తమకు సొంతిల్లు మంజూరు కాలేదని,ఇంటి కోసం దరఖాస్తు చేస్తే కాలయాపన చేస్తున్నారనీ,

ఇప్పటికీ ఇళ్లు మంజూరు కాలేదని పి. లక్ష్మి తెలిపారు. కూలి పని చేసుకుని బతికే వాళ్ళం, ఎక్కువ మొత్తంలో అద్దెలు భరించలేక శిథిల స్థితిలో ఉన్న జ్యూట్ క్వార్టర్ లో ఉంటున్నామని తెలిపారు

**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మన దేశమ్ : శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఈరోజు భీమిలి కాళ్ళ వీధి లో రాంభక్త ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో రాట వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కంటుభుక్త. ముత్యాలరావు, సంకురుభోతు.రమేష్,కాళ్ళ. శ్రీనివాసరావు ,కాళ్ళ.కొండమ్మ, ఎస్.రాజ్యలక్ష్మి, ముకుంద. ఆది లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.**



# తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' శస్త్రచికిత్స

## - మహిళకు మూత్రపిండాల పనితీరు పునరుద్ధరణ

### విశాఖపట్నంలోని ఏఐఎన్‌యు (AINU) హాస్పిటల్ సెంటర్ ఫర్ రోబోటిక్ సర్జరీ



**విశాఖపట్నం ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** ఉత్తరాంధ్ర యురాలజికల్ వైద్యరంగంలో ఆసియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యురాలజీ (ఏఐఎన్‌యు) వైజాగ్ సరికొత్త మైలురాయిని అధిగమించింది. కాకినాడకు చెందిన 50 ఏళ్ల మహిళకు అత్యంత సంక్లిష్టమైన 'లాంగ్-సెగ్మెంట్ యురేటరిక్ స్ట్రిక్చర్' (మూత్రనాళం పొడవునా ఏర్పడిన అవరోధం) సమస్యను నయం చేయడానికి, విశాఖపట్నంలోనే తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' రీకన్స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఆమె కిడ్నీ పనితీరును పునరుద్ధరించారు. బాధితురాలు ప్రారంభంలో మూత్రనాళంలో రాయి సమస్యతో బాధపడుతూ వేరే ఆసుపత్రిని సంప్రదించారు. అయితే మూత్రనాళం ఇరుకుగా ఉండడం వల్ల రాయిని తొలగించడం సాధ్యపడలేదు. ఫలితంగా ఆమె మూత్రపిండాల ఇన్ఫెక్షన్, మూత్ర అవరోధానికి గురయ్యారు. ఆ పరిస్థితిలో ఆమె ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో చేరగా, వైద్య బృందం వెంటనే పర్క్యుటేనియస్ నెఫ్రోస్టోమీ (పీసీఎన్) ట్యూబ్ ద్వారా ఇన్ఫెక్షన్‌ను నియంత్రించి, ఆ తర్వాత మూత్రనాళంలోని రాయిని తొలగించింది. అయినప్పటికీ, మూత్రనాళం చాలా భాగం దెబ్బతినడం వల్ల ఆమెకు పదేపదే ఇన్ఫెక్షన్లు వస్తుండేవి. దీంతో వైద్యులు రోబోటిక్ రీకన్స్ట్రక్టివ్ పద్ధతి ద్వారా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స సమయంలో యురేటర్ (మూత్రనాళం) భాగం ఊహించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. దాంతో సాధారణ శస్త్రచికిత్సలు ఉపయోగపడవని గ్రహించిన శస్త్రచికిత్స నిపుణులు, 'రోబోటిక్ బోరి ఫ్లాప్ రీకన్స్ట్రక్షన్' పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో మూత్రాశయం నుంచి ఒక చిన్న కణజాలాన్ని తీసుకుని, దెబ్బతిన్న మూత్రనాళాన్ని పునర్నిర్మించారు. సాంప్రదాయ ఓపెన్ సర్జరీ తో పోలిస్తే, రోబోటిక్ సాంకేతికత ద్వారా చిన్న కీహోల్ ద్వారా మాత్రమే ఈ ఆపరేషన్ పూర్తి చేశారు. దీనివల్ల రక్తస్రావం లేకపోవడం, నొప్పి లేకపోవడం మరియు రోగి వేగంగా కోలుకోవడం సాధ్యమైంది. శస్త్రచికిత్స పూర్తయిన మూడో రోజే రోగి కోలుకోవడంతో, కిడ్నీ ట్యూబ్‌ను తొలగించి ఆమెను డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ: "ఈ కేస్ చాలా సంక్లిష్టమైనది. మూత్రనాళం ఇరుకుగా ఉన్న భాగం కీలకమైన రక్తనాళాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఆపరేషన్ సవాలుగా మారింది. రోబోటిక్ పరిజ్ఞానం వల్ల అత్యంత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స పూర్తి చేయగలిగాం" అని తెలిపారు. ఏఐఎన్‌యు వైజాగ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీనియర్ యురాలజిస్ట్ డాక్టర్ జి. రవీంద్ర వర్మ మాట్లాడుతూ: "దీర్ఘకాలిక యురేటరిక్ స్ట్రిక్చర్స్ కిడ్నీ పనితీరును దెబ్బతీస్తాయి. రోబోటిక్ బోరి ఫ్లాప్ విధానం ద్వారా మూత్రాశయ కణజాలాన్ని ఉపయోగించి మూత్ర ప్రవాహాన్ని సాధారణ స్థితికి తెచ్చాము. బాధితురాలి కిడ్నీని కాపాడటంలో రోబోటిక్ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తెస్తోంది" అని పేర్కొన్నారు. ఈ రోబోటిక్ శస్త్రచికిత్సను డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ జి. రవీంద్ర వర్మ, మరియు డాక్టర్ పి. శ్రీధర్ లతో కూడిన నిపుణుల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో ఈ తరహా సంక్లిష్ట రోబోటిక్ శస్త్రచికిత్సలతో పాటు రాడికల్ ప్రోస్టేటెక్టోమీ, రాడికల్ సిస్టెక్టోమీ వంటి అనేక అధునాతన ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను 'దద్దమ్మ' అని సంబోధించడం సరికాదు

## అచ్చెంనాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ



**విశాఖపట్నం ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు 'దద్దమ్మ' అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధికార ప్రతినిధి లిఆల్ఫా కృష్ణలి అన్నారు. ప్రజా ప్రతినిధులు సభల్లో హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు లిబేషరతుగా క్షమాపణ చెప్పాలనిలి డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆల్ఫా కృష్ణ మాట్లాడారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో నోటికి వచ్చినట్లు మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

**'దద్దమ్మ నాయుడు' అంటే ఊరుకుంటారా? :** 'దద్దమ్మ' అనే పదాన్ని ఉపయోగిస్తూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆల్ఫా కృష్ణ తీవ్రంగా స్పందించారు. అదే పదంతో అచ్చెన్నాయుడిని ఎవరైనా సంబోధిస్తే ఆయన అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు దిగితే అది సభల గౌరవాన్ని దిగజార్చడమే అవుతుందని అన్నారు.

అచ్చెన్నాయుడు సోదరుడు, దివంగత ఎర్రన్నాయుడు వంటి సీనియర్ నాయకులు పాటించిన రాజకీయ విలువలను ప్రస్తుత నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. సభల్లో వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు.

**డీఎస్సీ అంశంపై ప్రభుత్వ ద్వంద్వ వైఖరి :** డీఎస్సీ అంశంపై అసెంబ్లీలో ఒక రోజు చర్చ జరిపి, మెజారిటీ ఉందనే కారణంతో తీర్మానం చేసిన అధికార పక్షం.. మరుసటి రోజు కౌన్సిల్‌లో అదే అంశంపై చర్చ అవసరం లేదని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆల్ఫా కృష్ణ విమర్శించారు.

డీఎస్సీ వ్యవహారంపై ఆరోపణలు నిజం కాదని ప్రభుత్వం భావిస్తే స్వతంత్ర దర్యాప్తుకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. ఈ అంశంపై సీబీఐ విచారణకు ఎందుకు అంగీకరించడం లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

**'విచారణకు భయమెందుకు?' :** అవినీతి, అక్రమాలు జరగలేదని ప్రభుత్వం చెబుతున్నప్పుడు స్వతంత్ర దర్యాప్తును ఎదుర్కోవడంలో భయమెందుకని ఆల్ఫా కృష్ణ నిలదీశారు. డీఎస్సీపై నిరుద్యోగ యువత ఆందోళన చేస్తున్న సమయంలో వైసీపీ కార్యక్రమాలు చేపడితే పట్టించుకోకుండా, అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. డీఎస్సీ అంశంపై నిరుద్యోగ యువతకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**వైఎస్సార్ పాలనలో జవాబుదారీతనాన్ని గుర్తు చేసిన ఆల్ఫా కృష్ణ :** గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపైనా విచారణకు సిద్ధమని ప్రకటించిన సందర్భాలను ఆల్ఫా కృష్ణ గుర్తు చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులకు విశ్వాసం, నైతికత, జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని అన్నారు. అదేవిధంగా గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మంత్రులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకున్న సందర్భాలను ప్రస్తావిస్తూ.. తప్పు జరిగితే చర్యలు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి ఉండాలని అన్నారు.

**'బొత్స సత్యనారాయణకు క్షమాపణ చెప్పాలి' :** కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయనను మాత్రమే కాకుండా ఆయనను గౌరవించే ప్రజలను కూడా అవమానించేలా ఉన్నాయని ఆల్ఫా కృష్ణ అన్నారు. బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నాయకుడిని సభలో అవమానించేలా మాట్లాడటం సరికాదని, అచ్చెన్నాయుడు వెంటనే లిబేషరతుగా క్షమాపణ చెప్పాలనిలి డిమాండ్ చేశారు.

**'మాటల పులులు కాదు.. చేతల పులులు కావాలి' :** ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి, డీఎస్సీ వ్యవహారం, ప్రస్తుత పాలనతో పాటు గత రాజకీయ పరిణామాలపై చర్చకు వైసీపీ సిద్ధంగా ఉందని ఆల్ఫా కృష్ణ అన్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ప్రతిపక్ష నాయకులను తక్కువ చేసి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చేతల్లో తన సామర్థ్యాన్ని చూపించాలని అన్నారు. టీడీపీకి ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదని విమర్శించిన ఆల్ఫా కృష్ణ.. వైసీపీ మాత్రం గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల కోసం, సిద్ధాంతాల కోసం పోరాడే పార్టీ అని అన్నారు.

**'ఒక మాట అంటే వంద మాటలతో సమాధానం' :** ఇప్పటివరకు వైసీపీ ఓపికగా వ్యవహరించిందని, ఇకపై అధికార పార్టీ నాయకులు చేసే ప్రతి అనుచిత వ్యాఖ్యకు రాజకీయంగా గట్టిగా సమాధానం ఇస్తామని ఆల్ఫా కృష్ణ హెచ్చరించారు. అరెస్టులు, కేసులు, జైళ్లతో వైసీపీ గొంతును అణచలేరని అన్నారు. అధికార పార్టీ నేతలు ప్రజల్లో బాధ్యతాయుతంగా మెలగాలని, వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**'క్షమాపణ చెప్పకపోతే పోరాటం ఉధృతం' :** బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే వైసీపీ అధినేత లివైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆల్ఫా కృష్ణ హెచ్చరించారు.

"అచ్చెన్నాయుడు. నోరు జాగ్రత్త. అధికారంలో ఉన్నారు కదా అని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజా జీవితంలో హుందాగా, బాధ్యతగా వ్యవహరించాలి. బొత్స సత్యనారాయణకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని ఆల్ఫా కృష్ణ డిమాండ్ చేశారు.

# శతశాతం అక్షరాస్యతే లక్ష్యం

## - డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి - ఉల్లాస్ జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభం




**విజయనగరం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** జిల్లాలో శతశాతం అక్షరా స్యతను సాధించేందుకు కృషి చేద్దామని డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి పిలుపునిచ్చారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షరాంధ్ర జిల్లా స్థాయి శిక్షణ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పిడి శ్రీనివాస పాణి మాట్లాడుతూ, అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు. సుమారు 145 కోట్లు పైబడిన మన దేశ జనాభాలో ఇప్పటికే 80 శాతం అక్షరాస్యతను సాధించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అయినప్పటికీ శతశాతం అక్షరాస్యతను సాధించే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. దీనికోసం ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకొని, అక్షరాస్యులుగా మారాలని పిలుపునిచ్చారు. అక్షరాలు చదవడం, రాయడంతోపాటుగా, సామాన్య పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై కూడా ఈ 100 గంటల శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఇటువంటి అవగాహనా కార్యక్రమం సామాన్య ప్రజలకు కూడా అవసరమేనని పిడి అభిప్రాయపడ్డారు. ఈ మూడవ విడత అక్షరాంధ్ర కార్యక్రమంలో జిల్లాలోని సుమారు లక్షా, 26వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వయోజన విద్య ఉపసంచాలకులు ఏ. సోమేశ్వర రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 2029 నాటికి 100 శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ పథకానికి అనుబంధంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## గుమ్మిడిపూండి, గూడూరు 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి

# కేంద్ర కేబినెట్ ఆమోదం

### కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి



**తిరుపతి, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** గుమ్మిడిపూండి-గూడూరు మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ కి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు ఉన్న రెండు లైన్లకి అదనంగా మరో రెండు లైన్లు నిర్మించానున్నారని ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం 90 కిలోమీటర్ల పొడవుతో, రూ.2,229 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారని ఆయన తెలియజేశారు. ఈ పనులను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ల నిర్మాణంతో చెన్నై, గూడూరు, రేణిగుంట మార్గంలో రైళ్ల రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా గూడూరు చెన్నై, విజయవాడ, రేణిగుంటలను అనుసంధానించే కీలక రైల్వే జంక్షన్ కావడంతో ఈ ప్రాజెక్టుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ప్రాజెక్టులో స్వర్ణముఖి నదిపై 360 మీటర్ల మెగా బ్రిడ్జితో పాటు 21 ప్రధాన వంతెనలు, 127 చిన్న వంతెనలు, 34 రోడ్ ఓవర్ బ్రిడ్జు, రోడ్డు అండర్ బ్రిడ్జు నిర్మించనున్నారని తెలిపారు. అదనపు సరుకు రవాణా సామర్థ్యం పెరగడం ద్వారా సిమెంట్, కంటైనర్లు, యంత్రాలు, ఆహార ధాన్యాలు, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణాకు మరింత వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు ప్రాంతాల రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి, పారిశ్రామిక మరియు ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు దోహద పడుతుందని ఎంపీ డా. మద్దిల గురుమూర్తి అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కీలక రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## గుడిలోవ లో ప్రారంభమైన

# ఆర్‌ఎస్‌ఎస్ మూడు రోజుల బైఠక్



**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :** ఆనందపురం మండలంగుడిలోవ 'విజ్ఞాన్ విహార్' పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అఖిల భారత సమన్వయ సమావేశం బుధవారం ఉదయం ప్రారంభమైంది. భారత్ మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడం ద్వారా సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ జీ, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే జీ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశం ఆగస్టు 21వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ వార్షిక అఖిల భారత సమన్వయ సమావేశానికి పూజ్య డా. మోహన్ భగవత్ జీ, దత్తాత్రేయ హోసబలే జీ లతో పాటు సహ-సర్కార్యవాహకులందరూ ఇతర కేంద్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతారు. ఈ సమన్వయ సమావేశానికి ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరణతో ప్రారంభమై పనిచేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ, అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికాసమితి లతో పాటు సంఘ్ స్ఫూర్తితో పనిచేస్తున్న మొత్తం 32 విభిన్న సంస్థల నుండి జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అఖిల భారత సంస్థాగత కార్యదర్శులు కొంతమంది ఎంపిక చేసిన కార్యకర్తలు హాజరయ్యారు. మొత్తం 49 మంది మహిళలతో కలిపి 327 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

# ఎర్ర మట్టి దిబ్బలు పరిరక్షణకై చర్యలు చేపట్టండి



**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :** భీమిలి ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటూ ఎంతోమంది పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించే ఎర్ర మట్టి దిబ్బల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని టి డి పి రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు తెలిపారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఎర్రదిబ్బల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు చేపట్టాలని కోరారు. సుమారుగా 18,500 నుండి 20,000 సంవత్సరాల కాలం సమయంలో ఇవి ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారని, నాటి భూగోళ పరిణామ క్రమానికి, వాతావరణ మార్పులకు సజీవ సాక్ష్యాలుగా ఎర్రదిబ్బలు వెలిసాయని అన్నారు. దక్షిణ ఆసియాలోని ఉష్ణమండలం ప్రాంతా లైన భీమిలి, తమిళనాడులోని తేరి స్మశానదిబ్బలు, శ్రీలంకలో మాత్రమే ఇటువంటి ఎర్రదిబ్బలు ఉన్నాయనీ చెప్పారు. భీమిలి ఎర్రదిబ్బలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ( జి.ఎస్.ఐ ) జాతీయ భౌగోలిక వారసత్వ సంపదగా 2014 వ సంవత్సరంలో ఎర్రదిబ్బలను ప్రకటించిందని అన్నారు. భీమిలి సముద్ర తీర ప్రాంతానికే వన్నెతెచ్చిన ఎర్రదిబ్బలను, వేలాదిమంది పర్యాటకులను ఎంతో ఆహ్లాదానికి గురి చేస్తుందనీ తెలిపారు ఇప్పటికే ఇసుక దిబ్బలు తరిగిపోతున్నాయని, కొంత ప్రాంతం ఆక్రమణకు గురవుతుందని అన్నారు. దయచేసి భీమిలి ఔనత్యానికి నిదర్శనంగా, ఈ ప్రాంతానికి ఉండే పేరు ప్రఖ్యాతులకు తగ్గట్టుగా పరిరక్షణలో భాగంగా చర్యలు చేపట్టాలని గంటా నూకరాజు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేసారు.

# 22న తొట్లకొండ పై అనుమతులు లేవు

**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :** నగరంలో బ్రిక్స్ బృందం పర్యటనలో భాగంగా ఈ నెల 22న తొట్లకొండ పైకి సందర్శకులకు అనుమతులు ఇవ్వరని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. బ్రిక్స్ బృందం నగర పర్యటనలో భాగంగా వీఎంఆర్‌డీఏకు చెందిన పర్యాటక ప్రాంతమైన తొట్లకొండను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న (శనివారం) ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు తొట్లకొండపైకి సందర్శకులను, పర్యాటకులకు అనుమతి ఇవ్వరని స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి తొట్లకొండపైకి యధావిధిగా అనుమతులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని నగరవాసులు, సందర్శకులు దయతో గమనించాల్సిందిగా కోరారు.





# 'మల్లెపూల పల్లకి' విమర్శలపై దర్శకుడేమన్నాడంటే?



అయ్యప్ప స్వామి భక్తులు పాడుకునే పాటల్లో 'మల్లెపూల పల్లకి'కి ఉన్న ఆదరణే వేరు. అయ్యప్ప మాల సీజన్ మొదలైందంటే ఈ పాట ఊర్లలో మార్మోగిపోతుంటుంది. మాస్ రాజా రవితేజను అయ్యప్ప భక్తుడిగా చూపిస్తూ 'ఇరుముడి' అనే సినిమా తీసిన మేకర్స్.. ఈ సినిమాలోనూ 'మల్లెపూల పల్లకి' పెడుతున్నారన్న వార్త బయటికి రావడంతో ఈ సాంగ్‌కు ముందే మంచి హైప్ వచ్చింది. పాట ఒక రేంజిలో ఉంటుందని ఊహించుకున్నారు. కానీ తీరా చూస్తే ఈ పాటను రిలీజ్ చేసినపుడు మిక్స్డ్ రెస్పాన్స్ వచ్చింది. ఒరిజినల్ సాంగ్‌ను యథాతథంగా కంపోజ్ చేసి ఉన్నా అదిరిపోయేదని.. జి.వి.ప్రకాష్ కుమార్ లాంటి టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఒరిజినల్ ట్యూన్‌కు సరితూగేలా సాంగ్ కంపోజ్ చేయలేదని, ఒరిజినల్ సింగర్ డప్పు శ్రీనుతోనే ఈ పాట పాడించినా అసలు పాటను మ్యాచ్ చేయలేకపోయారని విమర్శలు వచ్చాయి. సినిమాలో ఈ పాట డీజే వెర్షన్ ఉంటుందని, అది పెద్ద సర్ప్రైజ్ అని మేకర్స్ అంటున్నప్పటికీ.. జనాల్లో అంచనాలు పెరగట్లేదు. 'మల్లెపూల పల్లకి' సాంగ్ మీద వస్తున్న విమర్శలపై దర్శకుడు శివ నిర్వాణ తాజాగా స్పందించాడు. ఒరిజినల్ సాంగ్‌లో ఉన్న బేస్ వాయిస్‌కు 'ఇరుముడి'లో ఉన్న వాయిస్ సరితూగలేదన్న అభిప్రాయాన్ని శివ నిర్వాణ అంగీకరించాడు. అసలు పాటను పాడిన డప్పు శ్రీనుతోనే పాడించినా.. ఈ తేడా ఎందుకు వచ్చిందో అతను వివరించే ప్రయత్నం చేశాడు. ఒరిజినల్ సాంగ్‌ను డప్పు శ్రీను 15 ఏళ్ల కిందట పాడాడని.. ఇప్పుడు ఆయన వయసు పెరిగిందని, స్వరం మారిందని.. అందుకే ఒకప్పట్లా బేస్ వాయిస్ లేకపోవచ్చని అతనన్నాడు. ఒరిజినల్ సింగర్‌తో పాడించి గౌరవించాలన్న ఉద్దేశంతోనే డప్పు శ్రీనుతో ఈ పాట పాడించామని శివ తెలిపాడు. మరోవైపు అయ్యప్పస్వామి మాల నేపథ్యంలోనే సాగే మలయాళ చిత్రం 'మాలికాపురం'తో 'ఇరుముడి'కి వస్తున్న పోలికల గురించి కూడా శివ నిర్వాణ స్పందించాడు. రెంటినీ పోల్చడంలో ఆశ్చర్యం లేదని.. కానీ తన సినిమాలో ఏం కంటెంట్ ఉందో తనకు తెలుసు కాబట్టి తాను ఎప్పుడూ ఈ పోలికల గురించి కంగారుపడలేదని... తన సినిమా యునీక్‌గా ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రేక్షకులు కూడా అంగీకరిస్తారని అతను ధీమా వ్యక్తం చేశాడు.


## రజిని సినిమాలో విలన్... రాపో పెద్ద రిస్కు?





సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ధర్మన్ షూటింగ్ మంచి ఊపు మీద ఉంది. ఇప్పటికే పలు వాయిదాలు, డైరెక్టర్ల మార్పుతో బాగా లేట్ అయిన ఈ ప్రాజెక్టుని వచ్చే సంక్రాంతి బరిలో దింపాలనే సంకల్పంతో నిర్మాత కమల్ హాసన్ తన టీమ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే ఒక షెడ్యూల్ అయిపోగా రజని బ్రేక్స్ ఇవ్వకుండా నిత్యం అందుబాటులో ఉంటున్నారు. తాజాగా ఒక అప్డేట్ టాలీవుడ్ జనాలకు షాక్ కలిగించేలా ఉంది. చెన్నై సమాచారం మేరకు ధర్మన్ లో నెగటివ్ షేడ్స్ ఉన్న ఒక ముఖ్యమైన పాత్రకు రాపో రామ్ పోతినేని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అధికారికంగా ప్రకటించలేదు కానీ దాదాపు ఓకే అయినట్టు వినికిడి. రజని కూతురిగా నటిస్తున్న శ్రీలీలకు జోడిగా రామ్ ఉంటాడని, చాలా పవర్ ఫుల్ ఎపిసోడ్స్ రజనితో పాటు ఉంటాయని అంతర్గత వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. అంత పెద్ద కోలీవుడ్ స్టార్ తో నటించడం రామ్ కు ఒక ప్రత్యేక జ్ఞాపకంగా నిలిచిపోతుంది కానీ ఒక రిస్క్ ఉంది. రజనీకాంత్ కూలిలో నాగార్జున ప్రతినాయకుడిగా చేయడం ఆయనకు పెద్ద మేలు కలిగించలేదు. కారణం ఆ పాత్రను డిజైన్ చేసిన తీరు. విక్రమ్ రోలెక్స్ రేంజ్ లో పేలుతుందనుకుంటే అతి మామూలుగా వచ్చింది. దానికి తోడు కూలి ఫ్లాప్ కావడం నాగ్ కు ఉపయోగపడలేదు. అంతకు ముందు అజిత్ వలిమైలో టాలీవుడ్ యూత్ హీరో కార్తికేయ విలన్ గా చేయడం వల్ల ఎలాంటి బెనిఫిట్ దక్కలేదు. మరి రామ్ ఇవన్నీ ఆలోచించే ఒప్పుకన్నాడంటే ఏదో పవర్ ఫుల్ టచ్ ఉంటుంది. ఇంకా అఫీషియల్ గా చెప్పలేదు కానీ కన్ఫర్మేషన్ కోసమైతే ఇంకొద్ది రోజులు వేచి చూడాలి. స్వీయ దర్శకత్వంలో తన ఇరవై మూడో సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న రామ్ ఒకవేళ నిజంగా ధర్మన్ చేసే పనైతే డేట్స్ ఎలా అడ్జస్ట్ చేస్తారో చూడాలి. సెతస్కోప్ పట్టుకునే డాక్టర్ కత్తులు పట్టుకుని ఎందుకు రక్తపాతం సృష్టించాల్సి వచ్చిందనే పాయింట్ మీద ధర్మన్ రూపొందుతోంది. యాక్షన్,. వయొలెన్స్ ఈసారి పుష్కలంగా ఉంటాయట. దీనికన్నా ముందు జైలర్ 2 అక్టోబర్ రెండో వారంలో రిలీజ్ కానుంది.

## అభిమాని చిరకాల కోరిక తీర్చిన రామ్



సినీ హీరోల మీద ఫ్యాన్స్ వీరాభిమానానికి సంబంధించి ఎన్నో ఉదంతాలు చూశాం. కానీ ఇది చాలా చిత్రమైన వ్యవహారం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శశిభవ్యత అనే అమ్మాయి లాఫోరా మయోక్లోనిక్ ఎపిలెప్సీ అనే అరుదైన జన్యు పరమైన వ్యాధితో బాధ పడుతోంది. తరచూ ఫిట్స్ రావడం, నాడీ వ్యవస్థ దెబ్బ తినడంతో మంచానికే పరిమితం అయిన 18 ఏళ్ల ఈ అమ్మాయికి టాలీవుడ్ యువ కథానాయకుడు రామ్ అంటే వల్లమాలిన అభిమానం. మతిస్థిమితం కూడా సరిగా లేని ఈ అమ్మాయికి రామ్ పేరు చెబితే.. ఒంట్లో ఉత్సాహం వస్తోంది. శశిభవ్యత తల్లిదండ్రులు.. ఆమెకు రామ్ వీడియోలు, ఫొటోలు చూపించి అన్నం తినిపించి మందులు వేస్తున్నారట. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత.. రామ్ దృష్టికి వచ్చింది. ఈ అభిమాని పరిస్థితి చూసి కదిలిపోయిన రామ్.. వెంటనే స్పందించాడు. ఆ బాలికతో రామ్ వీడియో కాల్ మాట్లాడాడు. ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. శశిభవ్యతకు అవసరమైన మందులు, ఇతర ఖర్చులు అన్నీ ఇకపై తానే భరిస్తానని రామ్ తెలిపాడు. ఆమె రిపోర్టులు అన్నీ కూడా తనకు అందాయని.. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతుగా ప్రయత్నిస్తానని రామ్ చెప్పాడు .

## టాక్సిక్ కొంచెం జాగ్రత్త పడాల్సిందే



నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ టాక్సిక్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ కి టికెట్ రేట్ల పెంపు తీసుకుంటారనే టాక్ బయటికి రావడం ఆలస్యం సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో కూలి, కాంతార లాంటి వాటికి కూడా హైక్స్ ఇచ్చారు కానీ ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. ఏ మాత్రం తొందరపడినా దాని తాలూకు పరిణామాలు నేరుగా ఓపెనింగ్స్ మీద పడేలా ఉన్నాయి. టాక్సిక్ ఈ విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే పెద్ది తర్వాత అంటే జూన్ మూడో వారం నుంచి ఇప్పటిదాకా తెలుగు ప్రేక్షకులు ఎలాంటి టికెట్ రేట్ల పెంపు లేకుండా బోలెడు సినిమాలు చూశారు. మా ఇంటి బంగారం, లెనిన్, చెన్నై లవ్ స్టోరీ, విశ్వనాథ్ అండ్ సన్స్, ఒడిస్సి,. స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే మొదలైనవన్నీ విజయవంతంగా మాములు ధరలకే నిర్మాతలకు కనకవర్షం కురిపించాయి. ఆడియన్స్ కూడా ఇదేదో బాగుందని వాటికి బాగా అలవాటు పడ్డారు. ఇరుముడికి కూడా పెంపు అడగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో హఠాత్తుగా టాక్సిక్ కనక పెంపు తీసుకుంటే రిస్క్ అవుతుంది. ఎందుకంటే ఇది తెలుగు సినిమా కాదు. తెలుగు వాళ్ళు తీయలేదు. తెలుగు హీరో నటించలేదు. టెక్నీషియన్స్ ఎవరూ తెలుగు వాళ్ళు కాదు. అంతెందుకు టాలీవుడ్ యాక్టర్స్ ఎవరున్నారు అంటే ఠక్కున సమాధానం దొరకదు. అలాంటప్పుడు స్పెషల్ ట్రీట్ మెంట్ ఎందుకు ఇవ్వాలనేది మూవీ లవర్స్ ప్రశ్న. జిఓ వస్తుందనే ప్రచారం నేపథ్యంలో ఇంత చర్చ జరుగుతోంది. ఈ విషయం గురించే కాదు టాక్సిక్ లో బోల్డ్ కంటెంట్ మీద కూడా జనాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హీరో యష్ అంత ఏముందవని, నేను ఎవరినీ ముద్దు కూడా పెట్టుకోలేదని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. కానీ కియారా అద్వానీ, తారా సుతారియా పాటల్లో చూస్తేనేమో ఫుల్లుగా రొమాన్స్ ఉంది. ఇక్కడ లింక్ మిస్ అవుతోంది. ఏది ఏమైనా టికెట్ రేట్ల హైక్ తీసుకున్నా తీసుకోకపోయినా టాక్సిక్ మటుకు యునానిమస్ టాక్ తెచ్చుకుంటేనే మనదగ్గర వర్కౌట్ చేసుకోగలదు.



# బిజినెస్ న్యూస్



## ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ.. 24,100 దిగువకు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## అదరగొట్టిన బెహరీలాల్ ఇంజినీరింగ్.. 63% ప్రీమియంతో లిస్టింగ్




ఐరన్ అండ్ స్టీల్ తయారీ కంపెనీ బెహరీలాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ మదుపర్లకు లాభాల వర్షం కురిపించింది బుధవారం దాదాపు 63 శాతానికి పైగా ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.285 కాగా 60.70 శాతం లాభంతో బీఎస్ఈలో రూ.458 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలోనూ 63.15 శాతం ప్రీమియంతో రూ.465 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,135.22 కోట్లకు చేరింది. కంపెనీ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ డిమాండ్ వచ్చింది. చివరి రోజు నాటికి 108.44 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రూ.302 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ఒక్కో షేరు ధర రూ.271-285గా కంపెనీ నిర్ణయించింది.

35% ప్రీమియంతో షిప్ రాకెట్ అరంగేట్రం ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ కూడా వాటాదారులకు మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. 35 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.97గా కంపెనీ నిర్ణయించగా.. బుధవారం బీఎస్ఈలో 33.50 శాతం లాభంతో రూ.129.50 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలో 35 శాతం ప్రీమియంతో రూ.131 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ విలువ రూ.9,901.60 కోట్లకు చేరింది. ఈ కంపెనీ రూ.1617.5 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకి వచ్చింది. 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. చివరి రోజు నాటికి 99.38 రెట్ల బిడ్డింగ్ నమోదు చేసింది. ధరల శ్రేణి రూ.92-97గా నిర్ణయించింది .

## టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. వందేళ్లలో తొలిసారి




మంగళవారం జరగాల్సిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వాయిదా పడింది. సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ), సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్(ఎస్‌డీటీటీ) తమ ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో, ఏజీఎంకు కోరమ్ (కనీస సభ్యులు) లేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. వందేళ్లలో టాటా సన్స్ ఏజీఎం వాయిదా పడడం ఇదే తొలిసారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో ఈ రెండు ట్రస్టులకు 51% పైగా వాటా ఉంది. ఎందుకు ఇలా జరిగిందంటే: మహారాష్ట్ర ఛారిటీ కమిషన్ ఆదేశాల ప్రకారం, ఎటువంటి ప్రధాన నిర్ణయాలు తీసుకోవడం కానీ, సమావేశం నిర్వహించడం కానీ ఎస్ఆర్‌టీటీ చేపట్టరాదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరగాల్సిన ఏజీఎంకు తన ప్రతినిధిని ఎస్ఆర్‌టీటీ నామినేట్ చేయలేకపోయింది. దీంతో కనీసం అయిదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన ఏజీఎంను వాయిదా వేయక తప్పలేదు. పరిశీలకులు ముందుగానే దీన్ని ఊహించినా, టాటా సన్స్ మాత్రం మంగళవారం వరకు నిర్ణయం తీసుకోలేదు.

## ఆర్‌బీఐ కొత్త రూల్.. హోమ్‌లోన్ EMIలు మారనున్నాయా?



హోమ్‌లోన్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. గృహ రుణాల వడ్డీ రేట్ల రీసెట్‌కు సంబంధించి తాజాగా డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. దీనివల్ల ఇప్పటికప్పుడు రుణ గ్రహీతలపై ప్రభావం పడనప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఇంతకీ ఏమిటీ నిబంధన? దీనివల్ల ఏమిటీ ప్రయోజనం? సాధారణంగా హోమ్‌లోన్‌లు ఫ్లోటింగ్ రేట్‌తో ముడిపడి ఉంటాయి. అంటే, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను సవరించినప్పుడు దాన్ని అనుసరించి రుణ రేట్లు మారుతుంటాయి. అయితే, అన్ని బ్యాంకులూ ఒకేసారి మార్చవు. కొన్ని సందర్భాల్లో ఇవి మారడానికి ఏడాది సమయం పడుతోంది. దీనివల్ల తగ్గిన వడ్డీ ప్రయోజనం రుణ గ్రహీతలకు చేరడంలో ఆలస్యమవుతోంది.

**తీసుకొస్తున్న మార్పేంటి?**

ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల రీసెట్ సమయం మూడు నెలలకు మించకూడదని ఆర్‌బీఐ తన తాజా నిబంధనల్లో పొందుపరిచింది. అంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు వేగంగా ఆ ప్రయోజనం దక్కుతుంది. అదే సమయంలో వడ్డీ రేట్లు పెంచినప్పుడూ ఇదే నియమం వర్తిస్తుంది. దీనిపై సెప్టెంబర్ 11 వరకు అభిప్రాయాలను సేకరిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**వ్యక్తిగత రుణాలకు వర్తిస్తుందా?**

ఆర్‌బీఐ తీసుకొస్తున్న నిబంధనలు కేవలం ఫ్లోటింగ్ రేట్ రుణాలకు మాత్రమే. గృహ రుణాలకు మాత్రమే ఈ వడ్డీ రేట్లు ఉంటాయి. వ్యక్తిగత, ఆటో రుణాలకు స్థిర వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. కాబట్టి ఆర్‌బీఐ తీసుకొస్తున్న ఈ మార్పు వల్ల వ్యక్తిగత రుణాలపై ప్రభావం ఉండదు. కాబట్టి ఈఎంఐలలో ఎలాంటి మార్పూ ఉండదు. కొత్తగా తీసుకొనే గృహ రుణ వినియోగదారులు, ఇప్పటికే హోమ్‌లోన్ తీసుకున్నవారికే ఈ నిబంధన వర్తించనుంది.

# కొత్త అల్ట్రా లార్జ్ ఏఐ టీవీలు, నెక్స్ట్ జనరేషన్ మినీ ఎల్ఈడీ టెక్నాలజీతో ప్రీమియం టీవీల శ్రేణిని విస్తరించిన ఎల్జీ




**విశాఖపట్నం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ (ఎల్జీఈఐఎల్) తన 2026 ఏఐ టీవీల శ్రేణిని ప్రకటించింది. ప్రీమియం టెలివిజన్ విభాగంలో అల్ట్రా లార్జ్ స్క్రీన్లు, మినీ ఎల్ఈడీ టెక్నాలజీకి కేంద్ర స్థానాన్ని కల్పిస్తూ ఈ కొత్త శ్రేణిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఓటీటీ స్ట్రీమింగ్, ప్రత్యక్ష క్రీడల ప్రసారాలు, గేమింగ్ కోసం భారతీయ వినియోగదారులు భారీ స్క్రీన్‌లను ఎక్కువగా ఎంచుకుంటున్న నేపథ్యంలో ఎల్జీ తన క్యూఎన్ఈడీ ఇవో మినీ ఎల్ఈడీ శ్రేణిని ప్రధాన ఆకర్షణగా విడుదల చేసింది. ఇందులో 292 సెంటీమీటర్ల (115 అంగుళాల) ఫ్లాగ్‌షిప్ మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత మార్కెట్లో ఇప్పటివరకు ఎల్జీ విడుదల చేసిన అతిపెద్ద మినీ ఎల్ఈడీ స్క్రీన్ ఇదే. ఎల్జీ 2026 టీవీల శ్రేణిలో క్యూఎన్ఈడీ ఇవో మినీ ఎల్ఈడీ, ఓఎల్ఈడీ ఇవో, మైక్రో ఆర్జీబీ ఇవో/మినీ ఆర్జీబీ ఇవో, నానో 4కే యూహెచ్‌డీ అనే నాలుగు డిస్‌ప్లే టెక్నాలజీల్లో 190 సెంటీమీటర్ల (75 అంగుళాలు) నుంచి అంతకంటే పెద్ద పరిమాణాల్లో 25 అల్ట్రా లార్జ్ మోడళ్లు ఉన్నాయి. అత్యాధునిక చిత్ర నాణ్యత, ఏఐ ఆధారిత వ్యక్తిగతీకరణ, అద్భుతమైన ధ్వని అనుభూతి, మెరుగైన గేమింగ్ ఫీచర్లను భారతీయ వినియోగదారులకు అందించేందుకు ఈ శ్రేణిని రూపొందించింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సొల్యూషన్స్ డైరెక్టర్ బ్రియాన్ జంగ్ మాట్లాడుతూ భారతీయ వినియోగదారుల్లో భారీ స్క్రీన్‌లపై ఆసక్తి గతంలో ఎన్నడూ లేనంత వేగంగా పెరుగుతోంది. ఆ పెరుగుతున్న డిమాండ్‌ను విస్తృత స్థాయిలో తీర్చేందుకు మినీ ఎల్ఈడీ టెక్నాలజీతో ముందుకు వస్తున్నాం అన్నారు. ఈ ఏడాది మా శ్రేణిలో 292 సెంటీమీటర్ల (115 అంగుళాల) క్యూఎన్ఈడీ ఇవో మినీ ఎల్ఈడీ ఫ్లాగ్‌షిప్ టీవీతో పాటు ఓఎల్ఈడీ ఇవో, మైక్రో ఆర్జీబీ ఇవో, నానో 4కే యూహెచ్‌డీ పోర్ట్‌ఫోలియోను అందుబాటులోకి తీసుకొచ్చాం. వీటి ద్వారా స్టేడియంలో క్రీడలను వీక్షిస్తున్న అనుభూతి, సినిమా స్థాయి చిత్ర నాణ్యత, తదుపరి తరం ఏఐ ప్రాసెసింగ్‌ను దేశవ్యాప్తంగా వినియోగదారుల ఇళ్లకు తీసుకువస్తున్నాం." అని తెలిపారు. ఎల్జీ క్యూఎన్ఈడీ ఇవో మినీ ఎల్ఈడీ క్రీడలు, గేమింగ్ కోసం అల్ట్రా లార్జ్ స్క్రీన్‌లు 2026 శ్రేణిలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఎల్జీ క్యూఎన్ఈడీ ఇవో మినీ ఎల్ఈడీ టీవీలు గరిష్ఠంగా 292 సెంటీమీటర్ల (115 అంగుళాల) పరిమాణంలో అందుబాటులో ఉన్నాయి.

# అబ్బే.. హర్మ్యూజ్‌లో టోల్ లేదు డొనాల్డ్ ట్రంప్



దుబాయ్, వాషింగ్టన్: హర్మ్యూజ్‌లో టోల్ వసూలు ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్క రోజులోనే వెనక్కి తగ్గారు. టోల్‌కు బదులు.. పశ్చిమాసియా దేశాలు తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాయని, తమ దేశంలో భారీగా పెట్టుబడులు పెడతాయని మంగళవారం తెలిపారు. పశ్చిమాసియా నాయకత్వంతో చర్చల అనంతరం ఈ మేరకు హర్మ్యూజ్‌లో రుసుముల విధింపు నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. హర్మ్యూజ్‌లో నౌకలకు అమెరికా రక్షణ కల్పిస్తుందని, అందుకుగాను వాటిలోని సరకు విలువలో 20% టోల్ వసూలు చేస్తుందని ట్రంప్ సోమవారం సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.

కొనసాగిన దాడులు : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పూర్తిస్థాయి యుద్ధరూపం దాల్చే ముప్పు కనిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా మంగళవారం కూడా వైమానిక దాడులతో విరుచుకుపడింది. ప్రధానంగా ఆ దేశంలోని తీర రక్షక వ్యవస్థలు, క్షిపణి/డ్రోన్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. ప్రతిగా పశ్చిమాసియాలోని అగ్రరాజ్య మిత్రదేశాలైన బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లపై టెహ్రాన్ దాడులు చేసింది. ఇరాన్ నుంచి దూసుకొచ్చిన నాలుగు క్షిపణులను తాము అడ్డుకున్నట్లు జోర్డాన్ సైన్యం తెలిపింది.

# అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు



అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు వేసింది. 'జూక్-3' (ఝుబనబవ-3) రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న 'లాంగ్ మార్చ్-10బీ' రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వినియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.


# ఇమ్రాన్ ఖాన్‌ను కలిసిన భార్య, సోదరి



జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ను ఆయన సతీమణి, సోదరి కలిశారు. తన కుటుంబంతో వారానికి ఒకసారి సమావేశమయ్యేందుకు వీలు కల్పించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో దాదాపు 9 నెలల తర్వాత ఆడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్ తన సతీమణి బుష్రా బీబీ , సోదరి నొరీన్‌ను కలిసి మాట్లాడారు. మరోవైపు, ఆయన్ను ఆస్పత్రికి తరలించడానికి కావాల్సిన చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. తోషాఖానా, అల్-ఖాదిర్ ట్రస్ట్ తదితర కేసుల్లో శిక్ష పడటంతో ఇమ్రాన్ ఖాన్ కొన్నేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని.. ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని కొన్ని నెలలుగా వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ఇమ్రాన్‌ను చూడడానికి కుటుంబ సభ్యులను సైతం అనుమతించక పోవడంతో ఆయన పరిస్థితిపై ఆందోళన నెలకొంది.

# అందరూ కలిసే చేయాలి..

## లేదంటే ఎవరూ చేయొద్దు.. చమురు వ్యాపారంపై ఇరాన్



పశ్చిమాసియాలో చమురు ఎగుమతులు చేస్తే అన్ని దేశాలు కలిసే చేయాలని.. లేదంటే ఎవరూ చేయకూడదని ఇరాన్ స్పష్టం చేసింది. బహ్రెయిన్ లోని యూఎస్ నేవీ స్థావరంపై ఐఆర్‌జీసీ దాడులు చేసిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. తమను కాదని ముందుకు వెళ్తే.. అమెరికా మిత్రదేశాల చమురు, గ్యాస్ ఎగుమతి మార్గాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని.. పశ్చిమాసియా నుంచి చమురు, గ్యాస్ ఎగుమతుల మొత్తాన్ని ఆపుతామని హెచ్చరించింది. 'హర్మ్యూజ్ జలసంధిపై నియంత్రణ సాధించామని చెబుతూ.. అమెరికా నిన్న రాత్రి హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలను మోహరించింది. నౌకల రాకపోకలకు మార్గాలను మూసివేసి.. చమురు, గ్యాస్‌లను ప్రపంచానికి అందకుండా చేసింది. దీనివల్ల ఆ దేశ ఆర్థిక ప్రత్యర్థుల ప్రయోజనాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వారి దుర్మార్గాలకు తగిన బుద్ధి చెప్పడానికి మా దళాలు బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ బేస్‌పై విజయవంతంగా దాడి చేశాయి. ఈ దాడుల్లో ఎన్ఎస్ఐ మేనేజ్‌మెంట్ సెంటర్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ధ్వంసమయ్యాయి. పశ్చిమాసియాలో వ్యాపారం చేస్తే అందరూ కలిసే చేయాలి. లేదంటే ఎవరూ చేయకూడదు' అని ఐఆర్‌జీసీ హెచ్చరించింది.

ఇరాన్‌కు సహకారాన్ని ఆపడానికి చైనా కృషి చేయట్లేదు: అమెరికా రాయబారి

ఇతర దేశాలపై దాడులు చేయడానికి ఇరాన్‌కు పలు చైనా (జష్త్రఅఖు) కంపెనీలు సహకరిస్తున్నాయని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్ట్జ్ ఆరోపించారు. ఈ విషయంలో చైనా ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. హూతీలపై ఆయుధాల నిషేధాన్ని విధించిన ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని కూడా పలు చైనా కంపెనీలు, ఇతర సంస్థలు ఉల్లంఘించాయని పేర్కొన్నారు.

**లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్..**

ఓ వైపు అమెరికా-ఇరాన్‌లు పరస్పర దాడులు చేసుకుంటుంటే.. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొన సాగిస్తోంది. ఈ దాడుల్లో గాజాలోని ఓ కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

# హసీనాను అప్పగించకపోతే భారత్‌కు వెళ్లను

## బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్



ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ నుంచి విడుదల చేసి తమకు అప్పగించకపోతే భారత్‌లో పర్యటించబోనని బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ తెలిపారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనాను వీలైనంత త్వరగా తమకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. 2024లో బంగ్లాదేశ్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల అనంతరం షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాదేశ్ కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. భారత్‌లో ఉంటూ హసీనా మీడియాతో చేస్తున్న వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య చర్చలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ పేర్కొంది. హసీనాను అప్పగించాలన్న బంగ్లాదేశ్ అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ తన వైఖరిని వెల్లడించింది.

# నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

హైదరాబాద్ : నకిలీ వాహన నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల వ్యవధిలో నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగించిన వారిపై ఐదు క్రిమినల్ కేసులను పోలీసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రత్యేక తనిఖీల్లో పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తొలి సిక్కు ఫైటర్ పైలట్‌గా అర్ష్‌దీప్

లండన్: భారత సంతతికి చెందిన ఆర్ష్‌దీప్ సింగ్ చరిత్ర సృష్టించారు. బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్)లో తొలి భారతీయ సిక్కు ఫైట్ ఫైటర్‌గా ఎన్నికయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్‌లోని ఫైటర్ స్క్వాడ్రన్‌కు సిక్కు పైలట్‌ను నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

Truhome FINANCE

**DEMAND NOTICE**

**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)**

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం.5, పాత నం.11, 2వ లేన్, సెనోటాఫ్ రోడ్, అల్వార్ పేట , తేనాంపేట, చెన్నై – 600018
హెడ్ ఆఫీస్: లెవెల్ 3, వోక్హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై – 400051 వెబ్‌సైట్: www.truhomefinance.in

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు విఫలమ అయ్యారని మరియు పేర్కొన్న రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI ACT)లోని సెక్షన్ 13(2) కింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది, వారి చివరి చిరునామాలో. పేర్కొన్న డిమాండ్ నోటీసుతో పాటు, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడు తున్నది.
సెక్షన్ 13(2) కింద పంపిన రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బకాయిలు, డిమాండ్ నోటీసుల వివరాలు మరియు అక్కడ క్లెయిమ్ చేయబడిన మొత్తం కింద ఇవ్వబడ్డాయి-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ పేరు & చిరునామా | సురక్షిత ఆస్తుల ఆస్తి చిరునామా | డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం రూ. |
|---|---|---|
| ఎన్. వి. గాంధీబాబు బవిసెట్టి, తండ్రి: శ్రీ బవిసెట్టి రామకృష్ణ శ్రీమతి బవిసెట్టి శ్రీజ్యోతి, భర్త: ఎన్. వి. గాంధీబాబు బవిసెట్టి చిరునామా: డోర్ నెం. 4-22-2, డి.వి.ఆర్. అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 102, శ్రీ లక్ష్మీనగర్, నారాయణ స్కూల్ సమీపంలో, మండపేట, ఆంధ్రప్రదేశ్ – 533308. రుణ మొత్తం: రూ. 21,33,281/- NPA తేదీ: 11-06-2026 ఖాతా నెం.: SHLHRJMD0000910 | మొత్తం స్థిరాస్తి యొక్క వివరణ పూర్వపు తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుత కాకినాడ జిల్లా, కిర్లంపూడి మండలం, శ్రీ జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సోమవరం గ్రామ పంచాయతీ, సోమవరం గ్రామ తాలూకా, జెరియట్ మెర్కా, ఆర్.ఎస్. నెం. 66/4, డి.నెం. 1-16 సమీపంలో, డి.నెం. 1-7, అసెస్మెంట్ నెం. 7 గల కొత్తగా నిర్మించిన దాబా హౌస్ ఉన్న 219 చదరపు గజాలు లేదా 182.20 చదరపు మీటర్ల ఖాళీ స్థలం ఈ క్రింది సరిహద్దుల లోపల ఉంది: తూర్పు: కొప్పుల నాగరాజు గారికి చెందిన ఆస్తి 44.0 అడుగులు, దక్షిణం: దారి 45 1/2 అడుగులు, పడమర: దారి 41.0 అడుగులు, ఉత్తరం: సుంకు చక్రరావు గారికి చెందిన స్థలం 47 అడుగులు. పై సరిహద్దుల లోపల, అన్ని సాధారణ సులభతర హక్కులతో కూడిన 219 చదరపు గజాల స్థలం. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.2103893.98/- (ఇరవై ఒక్క లక్ష మూడు వేల ఎనిమిది వందల తొంబై మూడు రూపాయల తొంబై ఎనిమిది పైసలు మాత్రమే) 31-08-2026 నాటికి, రిఫరెన్స్ క్రింద లోన్ ఖాతా నెం. SHLHRJMD0000910 |
| రాంబుడ్డి పాపారావు, తండ్రి: శ్రీ పాపారావు శ్రీమతి రాంబుడ్డి దుర్గ, భర్త: రాంబుడ్డి పాపారావు చిరునామా: డోర్ నెం. 20-8-53/1, కొట్టాయరెడ్డి వీధి, మయూరి థియేటర్ ఎదురుగా, సినిమా రోడ్, కాకినాడ, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్ – 533002. రుణ మొత్తం: రూ. 16,14,594/- NPA తేదీ: 04-07-2026 ఖాతా నెం.: SLPHKNDA0000213 | మొత్తం స్థిరాస్తి యొక్క వివరణ గతంలో తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ మండలం ఎస్.ఆర్.ఓ - కాకినాడ మున్సిపల్ ఏరియా, వార్డు నెం.14 బ్లాక్ నెం.20 కాకినాడ కవర్ డ్రెయిన్ స్ట్రీట్, కోటయ్యరెడ్డి లేన్, పాత అసెస్మెంట్ నెం. 26484, పాత డి.నెం.20-8-53, టి.ఎస్.నెం.2001లో ఉత్తర దిశగా ఉన్న 102 1/2 చదరపు గజాల స్థలం మరియు పాత పెంకుటింటి నుండి, పశ్చిమ దిశగా ఉన్న 37.375 చదరపు గజాలు 31.25 చదరపు మీటర్ల స్థలం మరియు అందులోని భవనం (ప్రస్తుత డి.నెం.20-8-53/2, అసెస్మెంట్ నెం. 1060046478) కింది సరిహద్దులు మరియు కొలతలను కలిగి ఉంది:- తూర్పు: 34.6 అడుగులు లేదా 10.52 మీటర్లు. విక్రేతల మిగిలిన ఇంటి భాగం (సరిహద్దు గోడ ఈ ఆస్తికి చెందినది), దక్షిణం: 9.9 అడుగులు లేదా 2.97 మీటర్లు - మున్సిపల్ రోడ్డు, పడమర: 34.6 అడుగులు లేదా 10.52 మీటర్లు - సాలిహుండ లక్ష్మీకాంతం గారి ఇంటి గోడ ఉత్తరం: 9.9 అడుగులు లేదా 2.97 మీటర్లు - ఈ ఆస్తిలోని గోడకు ఆవల సిమ్మా అంజి గారి ఇల్లు పైన పేర్కొన్న సరిహద్దుల లోపల, 37.375 చ.గజాల 31.25 చ.మీ. స్థలం మరియు దానిలోని భవనం, అన్ని ఉమ్మడి మార్గాలు, జలమార్గాలు మరియు వాటికి జతచేయబడిన అన్ని సుఖభోగపు హక్కులతో సహా. కాకినాడ ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కాకినాడ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.1770144.84/- (పదిహేడు లక్షల డెబ్బై వేల నూట నలభై నాలుగు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే) 31-08-2026 నాటికి లోన్ ఖాతా నెం. SLPHKNDA0000213 |
| నున్న సత్యనారాయణ, తండ్రి: శ్రీ నున్న శ్రీరాములు శ్రీమతి నున్న వెంకట లక్ష్మి, భర్త: నున్న సత్యనారాయణ చిరునామా: డోర్ నెం. D 15-8-6/1, ఫ్లాట్ నెం. F2, సీ షెల్ అపార్ట్‌మెంట్స్, సత్యప్రసన్న నగర్, వెంకటరత్నపురం, కల్పనా బ్రిడ్జ్ డౌన్, కాకినాడ అర్బన్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్ – 533001. NPA తేదీ: 04-07-2026 రుణ మొత్తాలు: రూ. 8,86,557/- ఖాతా నెం.: SBTHKNDA0000196 రూ. 8,17,291/- ఖాతా నెం.: STUHKNDA0000207 | మొత్తం స్థిరాస్తి యొక్క వివరణ. కాకినాడ సబ్-రిజిస్ట్రార్, కాకినాడ మండలం, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడలో ఉన్న మరియు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, వెంకటరత్నపురం, కాకినాడ, టి.ఎస్. నెం. 1497, మున్సిపల్ వార్డ్ నెం. 9, బ్లాక్ నెం. 15, 8వ వీధి, డోర్ నెం. 15-8-6 పరిధిలోకి వచ్చే 1663.36 చదరపు గజాలు లేదా 1390.74 చదరపు మీటర్ల భూమి యొక్క సరిహద్దులు మరియు కొలతల వివరాలు. తూర్పు: 163.6 10.0-49.83 2. మున్సిపల్ రోడ్ దక్షిణం: 92.0 28.04- మున్సిపల్ రోడ్ పశ్చిమం: 161.6 01. 49.23, టి. హనుమంతరావు ఇల్లు, ఉత్తరం: 92.3. 28.12, పి. శ్రీరామచంద్ర రాజు గారి ఇల్లు పైన పేర్కొన్న సరిహద్దులు మరియు కొలతలు 1663.36 చ.గజాలు.. లేదా 1390.74 చ.మీ. వైశాల్యం యొక్క సగటు. మరియు 30 చ.గజాలు. లేదా 25.08 చ.మీ. వైశాల్యం నా పేరు మీద పేర్కొనబడలేదు. అవన్నీ చేర్చబడ్డాయి. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.926514/-(తొమ్మిది లక్షల ఇరవై ఆరు వేల ఐదు వందల పద్నాలుగు రూపాయలు మాత్రమే) & రూ.860841/- (ఎనిమిది లక్షల అరవై వేల ఎనిమిది వందల నలభై ఒకటి రూపాయలు మాత్రమే) 31-08-2026 నాటికి లోన్ ఖాతా నెం. SBTHKNDA0000196 & STUHKNDA0000207 |
| శ్రీ జక్కా వాసుదేవరావు, తండ్రి: శ్రీ జక్కా వెంకటేశ్వరరావు శ్రీమతి డోర్లే శ్వేత, సంరక్షణలో: వాసుదేవరావు జక్కా చిరునామా: డోర్ నెం. 19-52-2/B, రంగిరేజు వీధి, రామచంద్ర ప్రైమరీ స్కూల్ సమీపంలో, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ – 530001. రుణ మొత్తం: రూ. 47,24,711/- NPA తేదీ: 03-08-2026 ఖాతా నెం.: THLHVIZG0001362 | మొత్తం స్థిరాస్తి యొక్క వివరణ ఫ్లాట్ నెం: 4 & 5, "గ్రీన్ లీవ్స్", VMRDA LP నెం: 4/2023/ 1167/VMRDA/DPMS, సర్వే నెం: 6-5, 6-5పార్ట్, 6-6, 6-7, 6-8పార్ట్, 6-9 & 7-9 పార్ట్ పరిధిలోనిది. ఇది విశాఖపట్నం జిల్లా, భీమీనీపట్నం మండలం, దకమర్రి రెవెన్యూ గ్రామం, మజ్జిపేట గ్రామ పంచాయతీలో ఉంది మరియు దీనికి సరిహద్దులుగా ఉన్నవి: అంశం నెం.1. ప్లాట్ నెం.4, 153.33 చ. గజాల విస్తీర్ణం, ఉత్తరం: ప్లాట్ నెం: 5, దక్షిణం: ప్లాట్ నెం: 3, తూర్పు: లేఅవుట్ సరిహద్దు, పడమర: 12 మీటర్ల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు. అంశం నెం.2. ప్లాట్ నెం.5, 151.66 చ. గజాల విస్తీర్ణం. గజాలు ఉత్తరం: ప్లాట్ నెం 6, దక్షిణం: ప్లాట్ నెం: 4, తూర్పు: లేఅవుట్ సరిహద్దు, పడమర: 12 మీటర్ల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు. భీమునిపట్నం సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు విశాఖపట్నం రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ. 5142187.74/- (యాభై ఒక్క లక్ష నలభై రెండు వేల నూట ఎనభై ఏడు రూపాయల డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) 31-08-2026 నాటికి లోన్ ఖాతా నెం. THLHVIZG0001362 |
| కొత్తకోట నాగరాజు, తండ్రి: శ్రీ కొత్తకోట శ్రీరామమూర్తి శ్రీమతి కొత్తకోట శ్రీదేవి, భర్త: కొత్తకోట నాగరాజు చిరునామా: డోర్ నెం. 6-324, కంద వీధి, పాలకొండ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ – 532440. రుణ మొత్తం: రూ. 22,43,187/- NPA తేదీ: 03-08-2026 ఖాతా నెం.: SLPHSKLM0000007 | (ఆస్తి వివరణ) 128 చదరపు గజాల విస్తీర్ణం గల ఈ ఆస్తి, సర్వే నంబర్(లు) 479-1లో, పాలకొండ గ్రామంలోని హౌస్ నెం. 6-485 (సమీపంలోని ఉత్తర దిశలో)లో ఉంది. ఇది పాలకొండ సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది. దీనికి సరిహద్దులు: పశ్చిమాన: కొత్తకోట ఉమామహేశ్వరి గారి RCC ఇల్లు, ఉత్తరాన: నడకదారి, దక్షిణాన: C.C రోడ్డు, తూర్పున: వందాంకి రమణ గారి RCC ఇల్లు. ఇది పాలకొండ సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు పార్వతీపురం మన్యం రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.2514482.32/- (ఇరవై ఐదు లక్షల పద్నాలుగు వేల నాలుగు వందల ఎనభై రెండు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) 31-08-2026 నాటికి లోన్ ఖాతా నెం. SLPHSKLM0000007 |
| అనిశెట్టి ఉదయ్ కిరణ్, తండ్రి: శ్రీ అనిశెట్టి వెంకటేశ్వరరావు శ్రీమతి అనిశెట్టి శివ మల్లేశ్వరి, భర్త: అనిశెట్టి ఉదయ్ కిరణ్ చిరునామా: డోర్ నెం. 42-37, చంద్రబాబు నాయుడు, దేవరపల్లి మండలం, దేవరపల్లె, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 534313. రుణ మొత్తం: రూ. 28,22,643/- NPA తేదీ: 03-08-2026 ఖాతా నెం.: SHLHRJMD0001103 | తూర్పు గోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, శ్రీ కొవ్వూరు సబ్-రిజిస్ట్రార్ పరిధి, దేవరపల్లి గ్రామ పంచాయతీ, దేవరపల్లి తాలూకా, డి.నెం.4-204, జెరియట్ మెరక ఆర్.ఎస్.నెం. 113/1, అసెస్మెంట్ నెం.2056, ఇది 170 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్.సి.సి భవన సరిహద్దుల కొలతల వివరాలు: తూర్పు: ఎగ్జిక్యూటెంట్ స్థలం, దక్షిణం: రోడ్డు, పడమర: యరకరాజు వరలక్ష్మి స్థలం, ఉత్తరం: 4 అడుగుల వెడల్పు రోడ్డు. పైన పేర్కొన్న సరిహద్దుల లోపల ఉన్న 146 చదరపు గజాలు లేదా 142.309 చదరపు మీటర్ల ఆర్.సి.సి భవన స్థలం, తలుపులు, ప్రవేశ ద్వారాలు, కిటికీలు, అరలు, పైకప్పు మరియు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా. | డిమాండ్ నోటీసు తేదీ - 12-08-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.2884612/- (ఇరవై ఎనిమిది లక్షల ఎనభై నాలుగు వేల ఆరు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) 31-08-2026 నాటికి లోన్ ఖాతా నెం. SHLHRJMD0001103 |


మీరు రుణగ్రహీతలుగా, పై పేర్కొన్న బకాయి మొత్తాన్ని ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజుల లోపు పూర్తిగా చెల్లించవలసిందిగా దీనివల్ల ఆదేశించబడుచున్నారు. చెల్లింపుదాకా కలిగే వడ్డీ మరియు జరిమానా వడ్డీతో సహా మొత్తం బకాయిని చెల్లించాలి. అలా చేయని పక్షంలో, సదరు భద్రతలను అమలు చేయుటకు SARFAESI ACT ప్రకారం తగిన చర్యలు తీసుకోవలసి ఉంటుందని తెలియజేయబడుచున్నది. అదేవిధంగా, ఆ చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, మా సమ్మతి లేకుండా పై పేర్కొన్న భద్రతలను అమ్మకం, లీజ్ లేదా ఇతర మార్గాలలో బదిలీ చేయరాదని మీకు తెలియజేయబడుచున్నది.

స్థలం: మండపేట/జగ్గంపేట, కాకినాడ, విశాఖపట్నం శ్రీకాకుళం/పాలకొండ, దేవరపల్లి/రాజమండ్రి
తేదీ : 20-08-2026

సం /- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## సీనియర్ పాత్రికేయుడు

# దేవులపల్లి రామలింగం కన్నుమూత



**రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్) :** సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజానికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు, వెలుగు పత్రిక సంపాదకుడు దేవులపల్లి రామలింగం (60) మంగళవారం కాకినాడలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కిర్కంపూడిలో జన్మిం చిన రామలింగం 1985లో ఆంధ్ర భూమిలో పాత్రికేయ వృత్తిని ప్రారం భించారు. అనంతరం డెక్కన్ క్రానికల్లో 1998 వరకు పనిచేశారు. తరువాత ఉదయం దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా చేరి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు. 2002లో రాజమహేంద్రవరంలో వెలుగు పత్రికను ప్రారంభించి, అప్పటి నుంచి సంపాదకుడిగా కొనసాగారు. సూటిగా మాట్లాడే తత్వం, నిరాడంబర జీవనం, ధైర్యం, విస్తృత పరిజ్ఞానం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. జర్నలిజం కోసం తన వ్యక్తిగత ప్రయోజనాలను త్యజించిన రామలింగం, తన పూర్వీకుల ఆస్తిని సైతం పత్రిక నిర్వహణకు వినియోగించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడారు. సంపద కూడబెట్టకుండా పత్రికా రంగానికే తన జీవితాన్ని అంకితం చేశారు. ముద్రగడ పద్మనాభం, జక్కంపూడి రామ్మోహన్‌రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితర ప్రముఖులతో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి. రామలింగం మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. నిరాడంబరత, నిజాయితీ, ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన రామలింగం మరణం తెలుగు జర్నలిజం రంగానికి తీరని లోటని సహచర పాత్రికేయులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికల సంఘం దేవలపల్లి రామలింగం మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీ కె.ఎస్. రంగసాయి మాట్లాడుతూ, శ్రీ రామలింగం దశాబ్దాలుగా సంఘంతో అనుబంధం కలిగి ఉన్నారని, పలు సంవత్సరాలు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా సేవలు అందించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీ రామలింగం మరణం సంఘానికి తీరని లోటని , సంఘం తరపున వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.

# గీతంలో అలరించిన 'రెడ్ బుల్' రేసింగ్ కార్ ప్రదర్శన






**సాగర్‌నగర్, ఆగస్టు 19 (నేటి మనదేశమ్) :** గీతం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెడ్ బుల్ రేసింగ్ ప్రాజెక్ట్ / ఫార్ములా రేస్ కార్ ప్రదర్శనను గీతం అదుక్షులు ఎం. శ్రీ భరత్ ముఖ్య అతిధి గా పాల్గున్నారు. గీతం విద్యార్థులను, ఆటోమొబైల్ ప్రేమికులను విశేషంగా ఆకట్టు కుంది. మోటార్ స్పోర్ట్స్ సంస్కృతిని, ఇంజనీరింగ్ సాంకేతిక నైపుణ్యా లను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సంద ర్భంగా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు మరియు గీతం ఆటోమోటివ్ క్లబ్ సభ్యులు మరియు స్త్రబఖిష సభ్యులు రెడ్ బుల్ రేసింగ్ సాంకేతికత, అడ్వాన్స్ ఏరోడైనమిక్స్, వేగం మరియు పవర్-ట్రెయిన్ డిజైనింగ్ సూత్రాలను ప్రత్యక్షంగా వీక్షించి తెలుసుకున్నారు. ప్రపంచ స్థాయి రేసింగ్ విభాగంలో ఉపయోగించే ఇంజనీరింగ్ మెళకువలు, డిజైన్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన లభించింది. గీతం విశ్వవిద్యాలయానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు, మోటార్ స్పోర్ట్స్ ఔత్సాహికులు ఈ రేసింగ్ కార్ను సందర్శించి ఫొటోలు దిగుతూ హర్షం వ్యక్తం చేశారు. గీతం ఆటోమోటివ్ విభాగం ఇలాంటి గ్లోబల్ రేసింగ్ కార్యక్రమాల ద్వారా రాబోయే రోజుల్లో విద్యార్థులు సొంతంగా నేషనల్/ఇంటర్నేషనల్ రేసింగ్ ఈవెంట్లలో పాల్గొనేలా మరింత ప్రోత్స హిస్తుందని యాజమాన్యం స్పష్టం చేసింది. గీతం యూనివర్సిటీ యాజ మాన్యం, అధ్యాపకులు మరియు ఆటోమోటివ్ క్లబ్ కోఆర్డినేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శనను దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# జీవీఎంసీ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలి.

**- విశాఖ జిల్లా కలెక్టర్ & జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్**



**విశాఖపట్నం, ఆగస్టు 19:** జీవీఎంసీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేసి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రత్యేక అధికారి ఛాంబర్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి అభివృద్ధి పనులపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, 2026-27లో ప్రాధాన్యతగా చేపట్టిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, చేపట్టాల్సిన, ప్రతిపాదిత పనులు, వివిధ ప్రాజెక్టులతో పాటు రాబోయే పార్టనర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ కేటగిరీలకు సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి, చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణను ప్రత్యేక అధికారికి వివరించారు. జీవీఎంసీ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర పథకాలు, ప్రాజెక్టుల కింద చేపడుతున్న పనుల పురోగతిపై ప్రత్యేక అధికారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్లు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైన్లు, పార్కులు, స్మశాన వాటికలు, సెంట్రల్ మీడియన్లు, ఆధునిక పబ్లిక్ టాయిలెట్లు, చెరువుల సుందరీకరణ, వీధి దీపాలు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, స్టేడియంలు, తాగునీటి సదుపాయాలు, సర్వీస్ రోడ్ల అభివృద్ధి, జోనల్ కార్యాలయాల నిర్మాణం తదితర పనులపై సమీక్షించారు. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (ఖజఖీ), అమృత్ 2.0, ప్రాజెక్ట్ సారథి కింద చేపడుతున్న పనులతో పాటు రాబోయే పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు సంబంధించి ప్రతిపాదించిన పనుల పురోగతిని పరిశీలించారు. నగరంలో ప్రస్తుతం ఉన్న జంక్షన్లు, అభివృద్ధి చేస్తున్న జంక్షన్లు, ఇంకా అభివృద్ధి చేయాల్సిన జంక్షన్ల వివరాలను ప్రత్యేక అధికారి అడిగి తెలుసుకున్నారు. వాటి అభివృద్ధి, నిర్వహణకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ప్రాధాన్యత పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నగర భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న జనాభా, రాకపోకలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్లు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. బీచ్ ప్రాంతంలోని పార్కులను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి

## ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా






**విశాఖపట్నం, ఆగస్టు 19 (నేటి మన దేశమ్) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛా యుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వార్డుల వారీగా వివరాలు, రిజర్వేషన్లు, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను సరి చూసుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అవసరమైన డేటాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, మౌలిక వసతులు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సేకరించి, అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు చేపట్టాలని, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నిబంధనలు, విధివిధానాలు, బాధ్యతలపై దశలవారీగా పూర్తి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్ లభ్యతను ముందుగానే నిర్ధారించుకోవడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రీ-ఎలక్షన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్, ప్రచురణలు, ఓటర్ల విభజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రధానంగా మూడు దశల ఎన్నికల సరళిపై చర్చించారు. అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన 15వ రోజున పోలింగ్ నిర్వహించి, పోలింగ్ ముగిసిన 18వ రోజున ఫలితాలు ప్రకటించేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఓటర్లకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉన్నందున దీనిపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన 16వ రోజున పోలింగ్ నిర్వహించి, 19వ రోజున ఫలితాలు ప్రకటించే విధంగా షెడ్యూల్ ఉంటుందని చెప్పారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన 14వ రోజున పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, సామగ్రిని సిద్ధం చేయడం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ వివరించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీపీవో శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ రమణ మూర్తి, ఎస్.డి.సి. గోవిందు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

# మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి

**- దేశం మొత్తాన్ని కలిపే బాష సంస్కృతం**
**- తెలుగు, సంస్కృత భాషల వికాసానికి, అకాడమీ అభివృద్ధికి బహుముఖ ప్రణాళికలు**
**- చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర)**



**విశాఖపట్నం, ఆగస్టు 19 (నేటి మన దేశమ్) :** తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన తర్వాత భాషా వికాసం మరియు అకాడమీ బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) తెలిపారు. బుధవారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ఎ. యు. ప్రాంగణంలో గల తెలుగు అకాడమీ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని అకాడమీ ప్రాంతీయ కార్యాలయ భవనం అత్యంత శిథిలావస్థకు చేరి, కూలిపోయే స్థితిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితుల్లోనే ఇక్కడి నుంచి పుస్తకాల ముద్రణ, పంపిణీ సాగుతోందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నకు చెందిన ఆర్కిటెక్చర్ విభాగానికి చెందిన భవనాన్ని తాత్కాలికంగా కేటాయించాలని ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ ను కోరుడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే తిరుపతి, విశాఖపట్నంలలో శాశ్వత భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో, అమరావతి సి.ఆర్.డి.ఎ. ప్రాంతంలో 2 ఎకరాల భూమిని కేటాయించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, అకాడమీ వద్ద సొంత భవన నిర్మాణానికి 15 కోట్ల నుండి 20 కోట్ల రూపాయలు వరకు నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి మాతృభాష బోధించడానికి ఆంధ్ర ప్రదేశ్‌లో వర్చువల్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు నివేదికను ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి సమ ర్పించినట్లు తెలిపారు. అమరావతిలో 500 కోట్ల రూపాయలతో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యా లయం, 100 పడకల ఆయుర్వేద ఆసుపత్రి ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, దీని కోసం భూమిని ప్రభుత్వాన్ని కోరామన్నారు. గిడుగురామమూర్తి జయంతిని పురస్కరించుకొని భాషా పరిశోధ కులు, వ్యాకరణవేత్తలు, సాహితీ వేత్తలను గౌరవిస్తూ విజయవాడలో గిడుగు రామ్మూర్తి పేరిట పుర స్కారాలు అందజేస్తామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ నుంచి అకాడమీకి రావాల్సిన 60 కోట్లకు పైగా నిధులను తక్షణమే విడుదల చేయాలని గౌరవ ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేసినట్లు అయన తెలిపారు. అదేవిధంగా అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను ఎ.పి.పి.ఎస్.సి. ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. సంస్కృత సప్తాహం (ఆగస్టు 25 - 31) భాషా ప్రచారం కోసం ఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత యూనివర్సిటీ సహకారంతో 2026 ఆగస్టు 25 నుండి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా "సంస్కృత సప్తాహం" నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 25తేదిన శ్రీకాకుళం మరియు విజయనగరంలోను, ఆగస్టు 26 న విశాఖపట్నం మరియు కొవ్వూరు లలోను, ఆగస్టు 27 న తణుకు, గుంటూరు లలోను, ఆగస్టు 28న జిల్లెళ్లమూడి నందు, ఆగస్టు 30న కర్నూలు లోను, ఆగస్టు 31న గుడివాడ మరియు సమాపనోత్సవం విజయవాడ లలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. విశాఖపట్నంలో ఈ సదస్సు భారతీయ విద్యాకేంద్రంలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. తెలుగు, సంస్కృత భాషలను రెండు కళ్లుగా భావిస్తూ భాషా పరిరక్షణకు, అకాడమీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని చైర్మన్ శరత్ చంద్ర స్పష్టం చేశారు.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

**బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి**

**బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 19 :** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపా లని బ్యాంకర్లకు సూచించారు. ఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com